
# ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సారి వర్షాలు కూడా తక్కువేనని తెలుస్తోంది. ఈనెల 9 తేదీన నగరాన్ని కుదిపిన వర్షం తర్వాత ఆ స్థాయిలో పడలేదు. వాతావరణంలో పెనుమార్పులు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ రానున్న రోజుల్లో నగరంలో నీటి కటకటకు సంకేతాలు. ఇప్పటి నుంచే అప్రమత్తమవ్వకుంటే ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే కురిసిన ప్రతి వాననీటి చుక్కనూ ఒడిసిపట్టాలి. ఇప్పటికే వేసిన ఇంజక్షన్ బోర్లు, తవ్విన ఇంకుడు గుంతలను పునరుద్ధరించి సిద్ధం చేసుకోవాలి.



### పూడిక నిండిపోవడంతోనే

ఇటీవల కురిసిన వర్షాలకు గచ్చిబౌలి ప్రాంతంలోని మీనాక్షి టవర్స్ ప్రాంతం నీటమునిగింది. హైడ్రా ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ బాక్స్ డ్రైన్‌లు పూడికతో నిండిపోవడం కారణంగా ఆ పరిస్థితి తలెత్తిందని నిర్ధారించింది. వీటిలోని వరద వెళ్లేలోన ఉన్న 4 బోర్ల ద్వారా నీరు ఇంకేది. కానీ ఆ మార్గాల్లో చెత్త అడ్డురావడంతో రోడ్లు మునిగే పరిస్తితి తలెత్తింది. అందువల్ల మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు పూడిక తీత చేపట్టడం వల్ల ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉంటుంది.

### ఇవన్నీ పునరుద్ధరిస్తే ఎంతో మేలు

హెచ్ఎంఆర్ఎల్ 2018లో మెట్రో రైల్ కారిడార్ వెంట ఇంజక్షన్ బోర్లతో కూడిన వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు 100 చేపట్టింది. వీటితో పాటు భూగర్భజలాలను పెంపొందించేందుకు 200కుపైగా భారీ ఇంకుడు గుంతలనూ తవ్వించింది. ఒక్కో ట్యాంకు, ఇంజక్షన్ బోరుకు అప్పట్లో రూ.50 వేలును ఖర్చు చేసింది. ఖైరతాబాద్, ఎర్రమంజిల్, కూకట్‌పల్లి, మియాపూర్, జేఎన్‌టీయూ, రాయదుర్గం రూట్‌లలో వీటిని తవ్వించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సైతం 50కిపైగా ఇంజక్షన్ బోర్లను వేయించింది. ఏర్పాటు చేయడమైతే చేశారు కానీ వీటి నిర్వాహణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. చాలాచోట్ల అవి కనుమరుగయ్యాయి. వీటిని పునరుద్ధరించినట్లయితే భూగర్భ జలాలు పెరిగి ముంపు తప్పే అవకాశముంది. ఈ ఎల్?నినో సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నగరంలో ఉన్న పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలు, కాలనీ సంఘాలు వేల సంఖ్యలో తవ్వించాయి. వాటన్నింటిలో పూడిక తీయించినట్లయితే నీరు భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది.

### తక్షణ కర్తవ్యం :

పాత ఇంజక్షన్ బోరు ఉన్న ట్యాంకుల పైకప్పు మీదుగా నీరు వెళ్లే విధంగా శుభ్రం చేయాలి
పైపుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతే తొలగించాలి
కాలనీలు, అపార్ట్‌మెంట్లు, పార్కుల్లో తీసిన ఇంకుడు గుంతలు పునరుద్దరించడం
వాటిలోకి వరదనీరు వచ్చే మార్గాలు శుభ్రం చేయించాలి
నగరంలో రోడ్ల కింద తవ్విన బాక్స్? డ్రైన్లలోనూ పూడిక తీయించాలి
ఇళ్ల ముందు వాననీరు ఇంకే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి
వాననీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలి
మరిన్ని ఇంకుడు గుంతలు తవ్వే విధంగా అవగాహన కల్పించాలి

పైన వివరించిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలా వరకు ఎల్?నినో ముప్పు నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇప్పుడు ఉన్న వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే ఇదొక్కటే మార్గం. ప్రభుత్వం ఎన్నిచర్యలు చేపట్టినప్పటికీ పౌరసమాజం నుంచి కూడా సహకారం అవసరం. అందువల్ల జల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా సాగాల్సినటువంటి అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

-మొదటిపేజీ తరువాయి


ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో




చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు. ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏడేళ్ల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ అందుబాటులోకి 'జహీరాబాద్ త్రివేణి వనం'

కాంక్రీటు అడవులుగా మారుతున్న పట్టణాల్లో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతోంది. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కరవవుతున్న తరుణంలో దినదినాభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ వాసులకు సరికొత్త ఆహ్లాదం అందుబాటులోకి రానుంది. పట్టణ ప్రజలు ఏడేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 'త్రివేణి వనం ఫారెస్ట్ ఈకో పార్కు' ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నేడు(గురువారం) సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం వర్చువల్‌గా త్రివేణి వనం పార్కును ప్రారంభించనున్నారు. జహీరాబాద్ పట్టణ శివారులో, హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి పక్కన, మహీంద్రా కర్మాగారానికి సమీపంలో 200 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ 'అర్బన్ ఫారెస్ట్ పార్కు'ను నిర్మించారు. ఏడేళ్ల క్రితం సుమారు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో ఈ పార్క్? నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతాన్ని కాపాడుతూనే, పట్టణ ప్రజలకు ప్రశాంతతను పంచేందుకు చేపట్టిన ఈ పార్కు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ వారంలోనే సందర్శకులకు స్వాగతం పలికేందుకు 'త్రివేణి వనం' సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. హరిత నిధి పథకంలో రూ. 55 లక్షలతో పార్కును సకల సౌకర్యాలతో తీర్చిదిద్దారు.




### వనం పార్కులో ఏమేమి ఉన్నాయంటే

పిల్లల నుంచి పెద్దల వరకు అందర్ని ఆకట్టుకునేలా ప్రధాన ముఖద్వారం, అటవీ మధ్యలో గజెబో, వాచ్ టవర్ల నిర్మాణం పూర్తి చేశారు. సందర్శకులు సేద తీరేందుకు నాలుగు రచ్చబండలు, అటవీ జంతువుల దాహం తీర్చడంతో పాటు ప్రజల అవసరాల కోసం సోలార్‌తో నడిచే బోరు బావులను తవ్వించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచేందుకు 5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ (కాలినడక మార్గం) సిద్ధం చేశారు. యోగా ఏకకాలంలో 50 నుంచి 80 మంది ప్రశాంతంగా ధ్యానం చేసుకునేలా రెండు విశాలమైన యోగా షెడ్లు, చిన్నారులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా', వీటితో పాటు వాష్?రూమ్స్?, సెక్యూరిటీ గది నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

# రికార్డు స్థాయి వరి దిగుబడి తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

**హైదరాబాద్ :** దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## 3 రోజులపాటు రిజిస్ట్రేషన్ సేవలు బంద్

-మొదటిపేజీ తరువాయి

అనంతరం సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడతాయని చెప్పారు.

### వరుస సెలవులు ఉన్నందునే

నిర్దిష్ట తేదీలనే ఎంచుకోవడానికి గల కారణాలను ఐజీ వివరించారు. ఈ నెల 26న మొహర్రమ్, జూన్ 28న ఆదివారం కారణంగా ఈ రెండు రోజులు ప్రభుత్వ సెలవు ఉందని చెప్పారు. మధ్యలో ఉన్న శనివారం (జూన్ 27) ఒక్కరోజులో మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా సర్వర్ నిర్వహణ షెడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు.

## ఎవరు అడ్డుపడినా ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం

-మొదటిపేజీ తరువాయి

నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. దిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదనే తమ ప్రయత్నమని తెలిపారు.

### అభివృద్ధి చెస్తామంటే అడ్డుకుంటున్నారు

మూసీ అభివృద్ధి చేస్తామంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో మూసీ చుట్టుపక్కల ఉంటే దోమలు నోట్లోకెళ్లేవన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలనే తాము ప్రయత్నిస్తున్నామని, నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారని రేవంత్ రెడ్డి మండపడ్డారు. అలా చెప్పిన ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవడన్నారు. వాళ్ల ఫ్యూచర్?ను ప్రజలు నిర్ణయిస్తే ఫాంహౌస్?కు పరిమితమయ్యారన్నారు. కల్వకుంట వాళ్ల కడుపు నిండా కాలకూట విషమేనని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు వాళ్లకు బుద్ధిచెప్పారన్నారు. ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారన్నారు.

### ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్? తాగినా ఫ్యూచర్? సిటీని నిర్మిస్తామన్నారు.

### ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తాం

ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామన్నారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామని తెలిపారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే.. వీపులకు సున్నం పెడతామని కబ్జాదారులకు సీఎం మరోసారి హెచ్చరించారు.

### దిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే తమ ప్రయత్నం : రేవంత్ రెడ్డి

ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాలతో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైడ్రాను తీసుకొస్తే... దానిని భూతంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. న్యాయంగా నిర్మాణాలు చేసిన వారికి జోలికి హైడ్రా వెళ్లదన్నారు. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే మాత్రం హైడ్రా ఊరుకోదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు కబ్జాలు చేయడం వల్లే కాలనీల్లో నీళ్లు నిల్వ ఉంటున్నాయని, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. దిల్లీలో గాలి, నీరు మట్నత్తం విషం... అక్కడ నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. దిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే తమ ప్రయత్నమని సీఎం ప్రకటించారు.

## ఏడు రకాల సన్నాలకు బోనస్




-మొదటిపేజీ తరువాయి

మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్? కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 30న మధిరలో జరిగే భారీ బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఏడు రకాల సన్న రకాల వడ్లకు బోనస్? ఇవ్వాలని నిర్ణయించినట్లుగా వివరించారు. యాసంగి సీజన్?లో సుమారు 80 లక్షల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపిన ఆయన, కేంద్రం మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రుల సమావేశంలో డిమాండ్ చేసినట్లు వివరించారు.

వానాకాలంలో ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కోరుతూ దిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలవాలని నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రామగుండంలో ఉత్పత్తయ్యే ఎరువుల్లో అత్యధికంగా రాష్ట్రానికే కేటాయించాలన్నారు. హైదరాబాద్? మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బీజేపీ ఎంపీలు కలిసి రావాలని కోరారు. ఇకపై డిజిటల్ కేబినెట్ సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

### ధాన్యం సేకరణపై కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎక్కువగా ఉండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలతో విత్తనాలు వేయాలని రైతులను కోరుతున్నామన్నారు. ఎరువుల పంపిణీ, ధాన్యం సేకరణపై కేంద్రంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. లక్షమెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ యూరియాను కేంద్రం పంపించలేదన్నారు. తెలంగాణలో పండిన పంటలను కొనుగోలు చేయట్లేదని ఆక్షేపించారు. 17 లక్షల మెట్రిక్ టన్నులు తాము కొనుగోలు చేస్తే కేంద్రం ఇంకా కొనుగోలు చేయట్లేదన్నారు. తాము డిమాండ్ చేసినట్లు యూరియా రాకపోతే ఉద్యమం ద్వారానైనా సాధిస్తామన్నారు.

కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించి చేతులు దులుపుకొని రాష్ట్రంపై భారం వేస్తోందన్న మంత్రి తుమ్మల, దిల్లీ వెళ్లి కేంద్రమంత్రులను కలవాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మంత్రులు, అన్ని పార్టీల శాసనసభా పక్ష నేతలతో దిల్లీకి వెళ్తామని తెలిపారు. రామగుండం ఎరువులు ఇతర రాష్ట్రాలకు పంపించి రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. ఇక్కడి ఎరువుల కోసం అవసరమైతే ప్రభుత్వం తరఫున ఉద్యమం చేపడతామన్నారు.

### విబీజీ రామ్‌జీ పథకంపై నిరసన తెలిపాలని నిర్ణయం

మంత్రి సీతక్క మాట్లాడుతూ వీబీజీ రామ్?జీ జులై 1 నుంచి అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేస్తుందని వివరించారు. ఆ పథకంపై నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పారు. వీబీజీరామ్?జీపై నలుగురు మంత్రులతో కేబినెట్ సబ్? కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ పథకంతో జరిగే నష్టాన్ని మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతు పాండురంగ్ ఆత్మహత్య..!!

- పాండురంగ్ గారి కుటుంబాన్ని బీ=జా పార్టీ అండగా ఉంటుంది
- గౌరవ బోత్ మీజూ శ్రీ అనిల్ జాదవ్ గారు.



సి కే న్యూస్ ఈ రోజు సిరికొండ మండలంలోని పొన్న గ్రామానికి చెందిన చీ పాండురంగ్ గారు నిన్న రైతు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం దళారులతో దోపిడీ అధికారులు నిర్లక్ష్యం వల్ల మార్కెట్ లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న పాండురంగ్ గారిది ఆత్మ హత్య కాదు ప్రభుత్వ హత్య అనే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వనికి ముందు చూపు లేక రైతు మీద ప్రేమ లేక అధికారుల నిర్లక్ష్యం వల్ల దళారులతో దోపిడీ తో రైతు పాండురంగ్ విసిగిపోయి ఆత్మహత్య కీ దారితీసింది ఇది అని అన్నారు గత నేల 27 వ తేదీన పాండురంగ్ రైతు సిరికొండ మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రనికి తన జొన్న పంట తీస్కుకొని రాగా 17 రోజుల నుండి పడిగాపులు కసి చివరి అదే పంట పైన ప్రాణాలు వదిన రైతు ఈ నేల 7వ తేదీ నాడు పంట తూకం జరిగిన కూడా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ రోజువరకు కూడా అయన పంట లోడింగ్ కాకపోవడం మరియూ పంట లోడింగ్ కీ కింటల్ కీ 50 రూపాయలు వాసులు చేస్తున్న కూడా అధికారులు పట్టించుకోకుండా లంచకుండి వ్యవస్థ కీ ప్రేరేపిస్తూ దళారులతో కుమ్మకుఅయి రైతు మరణానికి కారణమైన ఏ ఒక్కరికి కూడ వదలం అని అన్నారు ఈ విషయం పై ఖు= గారు స్పందించి గౌరవ మీజూ గారి ద్వారా రైతు వివరాలు సేకరించారు.!!

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సూర్యకాంత్ పటేల్ మండల నాయకులు పెంటన్న,సూర్య కాంత్,రోహిదష్, ముండే పాండురంగ్ మరియూ తదితరులు ఉన్నారు.

# నోటు పుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్ తుర్రం శ్రీనివాస్ రావు.

- కి. శే. నాగ అరవింద్ జ్ఞపకార్థం గా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, రబ్బార్లు వితరణ.
- సంతోషదాయకం.ప్రధానోపాధ్యాయులు బి శంకర్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 18, తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల ప్రగతి, పాఠశాల నిర్వహణ, అభివృద్ధి తీరును గమనించి, గత సవంత్సరం పాఠశాల ఆవరణ గచ్చు వితరణ చేసారు. విద్యార్థిని, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఏ సహాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మాటిచ్చారు.ఇచ్చిన మాట ప్రకారము ఈ విద్యా సంవత్సరంలో తిమ్మంపేట పాఠశాల విద్యార్థుల అవసరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శంకర్.నామాల ప్రసాద్, నామాల కుమారి దంపతుల దృష్టికి తీసుకువెళ్లడం తో స్పందించి, తక్షణమే సహాయం చేయడానికి అంగీకరించారు.నోటు పుస్తకాలు స్టేషనరీ.వారు అందించిన ఆర్థిక సహాయంతో వెంటనే తెప్పించి విద్యార్థిని విద్యార్థులకు సర్పంచ్ తుర్రం శ్రీనివాస్ రావు చే పంపిణి చేశామని ప్రధానోపాధ్యాయులు బి శంకర్ తెలియ జేసినారు.

నామాల ప్రసాద్, నామాల కుమారి దంపతుల స్ఫూర్తితో మరింతమంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధిలో భాగస్తులు కావాలని ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

పాఠశాలకు ఆర్థిక సహాయం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు బి శంకర్ ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల, సురేష్, ప్రశాంత్, గ్రామ పెద్దలు పుప్పాల గోపి తదితరులు పాల్గొన్నారు

# అర్వపల్లి ఎస్సై ఈటా సైదులు సస్పెండ్

- జిల్లా ఎస్పీ కే నరసింహ



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న నాగారం సర్కిల్ పరిధిలోని అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఈటా సైదులను బుధవారం జిల్లా ఎస్పీ కె నరసింహ సస్పెండ్ చేశారు.విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, ఒక కీలక ఫోక్సో కేసు వ్యవహారంలో అనుచిత ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు ఈ చర్య తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

పలు కేసుల్లో ఆధారాలను తారుమారు చేసి అవినీతి, అక్రమాలను పాల్పడ్డట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ ఘటనల పై ఉన్నతాధికారులు ప్రాథమిక స్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. విచారణలో బయటపడిన అంశాల ఆధారంగా తక్షణ చర్యగా సస్పెన్షన్ విధించినట్లు సమాచారం. ఈ పరిణామం పోలీస్ విభాగంలో చర్చనీయాంశంగా మారింది.అయితే, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. విచారణ అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది జిల్లాలో ఉన్న ఏ స్టేషన్లో ఏ అధికారి అయిన అవకతవకలకు పాల్పడితే తక్షణమే సస్పెండ్ చేస్తామని సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ పోలీస్ అధికారులకు సూచించారు

# పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలంలోని తిర్లాపురం గ్రామంలో గురువారం రోజున ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని పేద విద్యార్థులకు ఎలాంటి కష్టం కాకుండా చూసుకోవాలన్నారు. కార్పొరేట్ బడుల్లో కన్నా నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తుందని చూపించారు. పిల్లలకు ఉదయం అల్పాహారం, యథావిధిగా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కావున గ్రామంలో ఉన్న విద్యార్థులందరూ ప్రభుత్వ బడుల్లోని చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.ఉప సర్పంచ్ గోగుల నాగమణి భర్త నరసింహారావు , ఉపాధ్యాయులు ప్రీతం గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి సెంటర్లను సందర్శించిన- గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.





- బొమ్మలతో బోధన.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కిట్లతో పాఠాలు
- బడి అంటే భయం పోగొట్టేలా బొమ్మలతో విజ్ఞానం.

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని మండలంలోని తిర్లాపురం గ్రామంలోని గురువారం నాడు అంగన్వాడి సెంటర్లను గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు సందర్శించి పిల్లలతో ముచ్చటించి వారి పేరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... నేటి బాలలే రేపటి పౌరులని, గ్రామములోని చిన్న పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడిలకు పంపించాలని కోరారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రీ స్కూల్ కిట్లు అందించి చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తున్నది. బడిని ఆకర్షించేలా ఆట వస్తువులను అందించి, వివిధ రకాల క్రీడలను ప్రోత్సహిస్తున్నది.అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు కావలసిన పాలు, గుడ్లు, బాలామృతం, పోషకహారాలు కలిగినటువంటి వారికి రోగ నిరోధక శక్తిని అందించే డైట్ ను తప్పక అందించి, సుఖ ప్రసవాలు అయ్యే విధంగా ఆహార పదార్థాలు అంగన్వాడి సెంటర్లు అందించాలని, దాంతోపాటు చిన్న పిల్లలకు కూడా సరైనటువంటి ఇమ్యూనిటీ అందించే పోషకా ఆహార పదార్థాలను అందిస్తూ వారికి చదువును కూడా అందించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ విధంగా అంగన్వాడి సెంటర్లు బాధ్యతతో పనిచేయాలని సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ఉప సర్పంచ్ గోగుల నాగమణి భర్త నరసింహారావు,గ్రామ సెక్రెటరీ ఉమారాణి, అంగన్వాడి టీచర్, నాగసీతరత్నం, గోగుల బ్రహ్మం శిరీష ,ఆయా అంజమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ, సమావేశం

మండల్ అధ్యక్షులు అధ్యక్షతన

జూన్ 18 (సీ కే న్యూస్) చేగుంట :చేగుంట పట్టణం లోని ఆర్ ఆబి గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టి మండల అధ్యక్షులు వడ్ల నవీన్ ఆధ్వర్యంలో గురువారం నాడు కాంగ్రెస్ పార్టి బూత్ లెవల్ ఏజెంట్ ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమం లో చేగుంట మండల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్,చేగుంట మార్కెట్ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, వివిధ గ్రామాల బూత్ ఏజెంట్ లు, సంతూష్, అశోక్ నాగరాజు, ప్రశాంత్, రాంచందర్ రెడ్డి, పోచయ్య,



సిద్దిరాములు, శంకరయ్య, సాబీర్, కమ్మరి సంతోష్, శ్రీనివాస్, పాల్గొన్నారు, వారికి ఓటర్ జాబితా ప్రతేక సమగ్ర సవరణ సమావేశం నిర్వహించడం జరిగింది,

# నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి...



జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు

పెబ్బేరు జూన్18 (సి కే న్యూస్)వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు అన్నారు. పెబ్బేరు మండలంలోని విత్తన దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా తో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్లు, సోర్స్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లందరూ విధిగా స్టాక్ బోర్డులు ప్రదర్శించాలని, ప్రతి విక్రయానికి రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు.వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని నిబంధనలు అతిక్రమిస్తే విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జూన్ (18) సి.కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్

జిల్లా సంగారెడ్డి. నారాయణఖేడ్‌లో భారత్ గ్యాస్ యజమానుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం నారాయణఖేడ్‌లోని భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద ఉదయం నుంచే వేచి ఉన్నప్పటికీ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కనెక్షన్ మరియు సిలిండర్ సరఫరా సంబంధిత సమస్యలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, యజమానులు స్పందించడం లేదని వారు ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# మత్కేపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ రోడ్డు పనుల పరిశీలన





సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో మత్కేపల్లి నూతన వ్యవసాయ మార్కెట్‌కు మంజూరైన రూ.4.5 కోట్ల నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను డివిజనల్ ఇంజనీర్ కుతుంబాక శ్రీనివాసరావు , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు పరిశీలించారు. జేసీబీ యంత్రాలతో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో , జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు మత్కేపల్లి ఏఎంసీ డైరెక్టర్ బందెల నాగార్జున కాంగ్రెస్ నాయకులు తాళ్లూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకోవాలి .

పిలుపునిచ్చిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల కేంద్రంలో ఉన్న ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేసిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు.

ఈ సమావేశంలో కిలారు మనోహర్ బాబు మాట్లాడుతూ...ప్రైవేటు స్కూల్ కంటే ప్రభుత్వ స్కూలు మంచిదని ప్రభుత్వ స్కూల్లో అనుభవజ్ఞులు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని వారి యొక్క అనుభవాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు...

ఈ యొక్క సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు,మరియు కోలా నాగేశ్వరరావు షేక్ రహితుల్లా,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కె. టి దొడ్డి మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల్ :ఈరోజు గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండలం కేంద్రంలో గ్రామంలో, మరియు గంగన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు.

గంగన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు దేవన్న....

అదే విధంగా చింతలకుంట గ్రామంలో కూడా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

. కె. టి దొడ్డి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు..... అంజి ,,మహేష్ గోవిందమ్మ

మంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది .

నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు కానుకను అందజేశారు .

ఎమ్మెల్యే గారికి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ....

నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.

గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.

ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారికి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు .....

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...

ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం గారికి మంత్రి గారికి మా ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మెన్ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీలు సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ నాయుడు, సర్పంచ్ నారాయణ , పైటల నరసింహులు నాయకులు ఉరుకుంద, యుగంధర్ గౌడ్ , మైలగడ్డ చంద్రశేఖర్ , వెంకన్న గౌడ్, కొండన్న , వీరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొట్టడంతో, ఇద్దరికీ గాయాలు



జూన్ 18 (సీ కే న్యూస్) చేగుంట :బైక్ పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను లారీ ఈ కొట్టిన సంఘటన, చిన్న శంకరంపేట్ మండలం చందంపేట గ్రామానికి చెందిన, షేక్ ఎల్లం (33), రామంతాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన ఆంజనేయులు(35) ఇద్దరు కలిసి, ఎల్లం బైకు పైన చేగుంట నుండి రామంతాపూర్ కు వెళుతుండగా, రామంతాపూర్ చౌరస్త వద్ద, హైదరాబాద్ వైపు నుండి నిజామాబాద్ వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టడంతో, తీవ్ర గాయాలు కావడంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఇట్టి విషయంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

# ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా.

- గుండు కొట్టించుకుంటే మతి పోతుందా.
- ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన భాష.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల పరిధిలో నాగులవంచ గ్రామంలోని చింతకాని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంశం పై ఇరు పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం నడుస్తోంది.గురుకులాల టెండర్లలో ?2,000 కోట్ల నుండి ?3,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆధారాలతో ప్రశ్నించిన మాజీ ఐపీఎస్ అధికారి,బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేధావి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీకౌంటర్ గా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు, కామెంట్స్ వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డల నోళ్లు కొట్టి టెండర్లలో వేల కోట్ల అవినీతికి పాల్పడడమే కాకుండా, ఆ అవినీతిని ప్రశ్నించినందుకు వ్యక్తిత్వ హననం చేస్తూ,రూపూను అవహేళన చేస్తారా ఇది కేవలం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారిపై జరిగిన దాడి కాదు తెలంగాణలోని బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులపై జరిగిన దాడి నేటి ప్రెస్ మీట్ ద్వారా చింతకాని మండలం బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్స్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై చేసిన వ్యక్తిగత, అహంకారపూరిత వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి బహిరంగ క్షమాపణ చెప్పాలి అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో చింతకాని మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు దర్శ బాలకృష్ణ,పరసగాని ఏడుకొండలు, కొల్లి బాబు,ఐతం ఆదినారాయణ,సంపంగుల వెంకన్న, ముప్పిడి వెంకన్న,పడిసాల తిరుపతిరావు,తదితరులు పాల్గొన్నారు.

# నూతన నాూజూ ఫార్మ సర్వీస్ సెంటర్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు ...




సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల : ఈరోజు గద్వాల నియోజకవర్గం లోని ధరూర్ మండల పరిధిలో బూరెడ్డిపల్లి గ్రామం నందు నూతన నాూజూ ఫార్మ సర్వీస్ సెంటర్ షాప్ ను ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.

ఎమ్మెల్యే గారికి షాప్ యజమాని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు ...

నాూజూ ఫార్మ సర్వీస్ సెంటర్ ను ఎమ్మెల్యే గారు పరిశీలించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రఘువరన్ రెడ్డి, సర్పంచ్ విజయుడు, గ్రామ పెద్దలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి వెంకన్న -- సీత దంపతుల కుమార్తె నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు ఈ శుభకార్యానికి చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, పునాటి కృష్ణారావు, ఎస్.కె. సిద్దయ్య, కృష్ణ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మొగిలి వెంకన్న కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిశ్చితార్థం చేసుకున్న జంట సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# సవారమ్మ , కర్రెమ్మ అవ్వ వారి దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి గారు

గ్రామ దేవతలు అమ్మ వారి దేవర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే సతీమణి గారు.



సికె న్యూస్ ప్రతినిధి గద్వాల : ఈరోజు గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని పరుమాల గ్రామంలోని గ్రామదేవత సవారమ్మ అవ్వ, కర్రెప్ప అవ్వ, దేవర సందర్భంగా అమ్మవారిని దేవాలయం లో ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి గారు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులను పొందడం జరిగినది.

ఎమ్మెల్యే సతీమణి గారు మాట్లాడుతూ....

గ్రామంలోని గ్రామ దేవతలను పూజించడం వల్ల గ్రామానికి ఇలాంటి చెడుగాలి సుఖకుండా గ్రామం పై ఎలాంటి నరదృష్టి రాకుండా గ్రామదేవతలు కాపాడడం జరుగుతుంది. గ్రామంలో ప్రతి ఇంట్లో దేవర సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది జరిగినది.

గ్రామదేవతలు ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగినది.

ఈ కార్యక్రమంలో, రెడ్డి సేవా సమితి అధ్యక్షురాలు రాధారెడ్డి సర్పంచ్ సంధ్య ఆంజనేయులు , మాజీ సర్పంచ్ వాసు,నాయకులు, కరెంటు రాజు యాదవ్ శ్రీకాంత్ యాదవ్, వంశీ రాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా ప్రారంభం.




సీకే న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ : పట్టణంలోని ఎకో పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.ముఖ్య అతిథులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటికి నీరు పోశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డాక్టర్ చిన్నారెడ్డి పిలుపునిచ్చారు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు వనపర్తి జిల్లాకు 24 లక్షల మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు.

ప్రకృతి సమతుల్యత కోసం అటవీ విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం ఉన్న 24 శాతం అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచేందుకు అందరూ సహకరించాలని కోరారు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ మొక్కలు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో కీలకమని చెప్పారు నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమన్నారు.

విద్యార్థులు తమ పేర్లపై మొక్కలు నాటడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాకు నిర్దేశించిన 24 లక్షల మొక్కల లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జెడ్పీ సీఈవో యాదయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు సూచించారు వనమహోత్సవ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా కొనసాగనుంది.

# మాల ఉప కులాల మహాసభ ను జయప్రదం చేయండి....



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 18,జూలై 12 భద్రాచలంలో నిర్వహించనున్న మాల ఉపకులాల రాలిని విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ పిలుపునిచ్చారు, రోస్టర్ విధానంలో మాలలకు ఉప కులాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని మాల ల ఐక్యత , విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సత్తా చాటాలని పిలుపునిచ్చారు సందర్భంగా హైదరాబాద్ మంత్రి వివేక్ నివాసంలో ఆయన కలిసి గౌరవ అధ్యక్షులుగా ఆయనను ఆహ్వానించారు జూలై 12న జరిగే భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవనంలో జరగబోయే కార్యక్రమానికి అనంతరం మహా ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు మాల ఉప కులాల విద్యార్థిని విద్యార్థులు దళిత సంఘాల నాయకులు మాల మహానాడు సోదర సోదరీమణులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్, రాష్ట్ర నాయకులు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎర్ర మల్ల రాములు, కె ఆర్ నాగరాజు, మేడిపల్లి సత్యం, సత్తుపల్లి శాసనసభ్యులు మట్ట రాగమయి, దా మల్ల సర్వయ్య, మందాల భాస్కర్, కొంతటి వీరభద్రం, కిషన్, రాజశేఖర్ సుదీప్, డాక్టర్ గంగరాజు డాక్టర్ జగదీష్ , బుయని వీరబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన వివరించారు.

# నూతన ఎస్ ఐ నరేష్ ని కలిసిన రామకృష్ణాపురం బి ఆర్ఎస్ పార్టీ నాయకులు.





సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని నూతన ఎస్ ఐ నరేష్ ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రామకృష్ణపురం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు కురుగుంట్ల రవీందర్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్ నాయకులు శెట్టి మోహన్ రావు, శెట్టి సురేష్ బొమ్మకంటి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు .

## చెర్లపాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌తో మేక మృతి





(మహబూబాబాద్ జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చెర్లపాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌తో మేక మృతి చెందిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. గ్రామానికి చెందిన జంగిడి కుమార్ (తండ్రి అయిలయ్య) ప్రతిరోజులాగే తన మేకలను మేతకు తీసుకెళ్లగా, అనుకోకుండా ఓ ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లిన మేక విద్యుత్ వైర్లకు తగలడంతో తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఈ ఘటనతో మేక యజమాని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. మృతి చెందిన మేక తన కుటుంబ జీవనాధారంలో ముఖ్యమైనదని, దీంతో తనకు ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

గ్రామస్థులు కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టంగా చేపట్టాలని, ప్రమాదాలకు కారణమయ్యే విధంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జంగిడి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాలనీల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి..



రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, సి కె న్యూస్ ప్రతినిధి ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలోని మీధాని కాలనీ, దుర్గా హోమ్స్, దుర్గా నగర్ ఫేజ్-2, ల్యాండ్‌మార్క్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మీధాని కాలనీలో నూతన డ్రైనేజీ లైన్, రోడ్లు, పార్కుల అభివృద్ధి, విద్యుత్ స్థంభాల ఏర్పాటు, దుర్గా హోమ్స్‌లో కొత్త రోడ్లు, యూజీడీ పనులు, దుర్గా నగర్ ఫేజ్-2లో రోడ్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ స్థానం మార్పు, ల్యాండ్‌మార్క్ కాలనీలో యూజీడీ లైన్ మార్పు మరియు కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. వినతులను సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అక్కడే ఉన్న డీఈ బిక్షపతిని ఆదేశిస్తూ అన్ని పనులకు అవసరమైన అంచనాలు సిద్ధం చేసి, మంజూరు కోసం సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గ్రామం మరియు కాలనీల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీధాని కాలనీ అధ్యక్షుడు బాతుల శంకర్ గౌడ్, దుర్గా నగర్ ఫేజ్-2 అధ్యక్షుడు నందుటి సంతోష్ గౌడ్, దుర్గా హోమ్స్ అధ్యక్షుడు విజయరాజు, ల్యాండ్‌మార్క్ కాలనీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కే.టీ.ఆర్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘాలు.

- "ఇసుక సొసైటీ ఉపాధికి అడ్డు వస్తే" ఊరుకునేదే లేదు."
- "మీ రాజకీయ లబ్ధికోసం, ఆదివాసులను బలి చేయకండి."
- "గిరిజన ఉపాధికి మార్గం వేసిన వాడే" ఆదివాసి అభివృద్ధికి అడ్డు."
- "ఖబర్దార్ గిరిజనుల అభివృద్ధికి విఘాతం కల్పిస్తే ఊరుకునేది లేదు."
- "ములుగు జిల్లా లో ప్రతిపక్షంపై మండిపడుతున్న గిరిజన సంఘా నేతలు "



"ములుగు జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి భార్గవ్"తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఇసుక సొసైటీ ల ద్వారా ఉపాధి పొందుతూ ఇప్పుడిప్పుడే ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేస్తున్న గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోవద్దని ములుగు జిల్లా గిరిజన సంఘాల నాయకులు అన్నారు.. గురువారం వారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీ.ఆర్.ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరా జరిగిన ఇసుక దోపిడీ గురించి పెదవి పెగల్చని కే.టీ.ఆర్ నేడు ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకు తావు లేకుండా గిరిజనుల అభివృద్ధికి ఇతోధికంగా ఉపయోగపడుతున్న గిరిజన ఇసుక క్వారీలపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదాన్నారు... పేద ప్రజలకు ఉపాధిని ఇస్తున్న ఇసుక క్వారీలపై కే.టీ.ఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు..

నిన్న మీరు గిరిజన ఇసుక క్వారీల గురించి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది అని తెలిపారు..

మీ ప్రభుత్వ హయాంలో ఇసుక రంగంలో జరిగిన దోపిడీ తెలంగాణ ప్రజలందరికీ తెలుసు. గిరిజన సొసైటీలకు సరైన అనుమతులు ఇవ్వకుండా, అడ్డగోలుగా ఓవర్‌లోడ్లు, జీరో వ్యాపారాలు నడిపింది ఎవరో జగమెరిగిన సత్యమే.

ఇరిగేషన్ క్వారీల పేరుతో ఏమి జరిగిందో, డబుల్ బెడ్‌రూమ్ ఇసుక పేరుతో ఎంత దోపిడీ జరిగిందో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. అంతేకాదు, అడ్డగోలుగా వ్యాపారం చేయించి గిరిజన సొసైటీలకు రావాల్సిన బిల్లులు కూడా ఇవ్వకుండా జరిగిన అన్యాయానికి మీరు ప్రజలకు క్షమాపణ చెప్పాలి.. అంటూ అంతే కాకుండా,

ప్రస్తుతం ఇసుక వ్యాపారం ఎలా జరుగుతుందో తెలుసుకుని మాట్లాడండి. ఎక్కడైనా ఒక్క టన్ను ఓవర్‌లోడ్ వెళ్తుందా? ఎక్కడైనా జీరో బిజినెస్ జరుగుతుందా? దమ్ముంటే నిరూపించండి.

ఆధారాలు లేకుండా, పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం చేసి వేలాది మంది ఉపాధిపై దెబ్బ కొట్టే ప్రయత్నం చేస్తే, ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. అలాంటి రాజకీయాలతో మీరు ప్రతిపక్షంలో ఉన్న స్థానం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది..

మీ ప్రభుత్వం సమయంలో కాళేశ్వరం పూడికతీత 25 నుంచి 30 కోట్లు క్యూబిక్ మీటర్లు టెండర్లు కి పిలిచి దోచుకుంటివి తింటివి ఆయన నీ అవినీతి కి అది సరిపోలేదా అని ఆరోపించారు..

-అప్పుడు మీ ప్రభుత్వం నేరేళ్ల ప్రజలు అక్రమ రవాణా ఆపమని కోరితే ఆ ప్రజలనీ కొట్టించి బెదిరించి లారీ లు తో గుద్దించి కేసు లు పెట్టించి బయ బ్రాంతులకు గురి చేసినప్పుడు ఎక్కడికి పోయి మాట్లాడవు.. నీ ప్రభుత్వం వచ్చిన తరువాత సంతోష్ రావు హరీష్ రావు మీరు నడపలేదా ఓవర్లోడ్లు జీరో లు అక్రమ రవాణా...ఈ ప్రభుత్వం లో ఎక్కడ అవినీతి జరుగుతుందో నిరూపించాలి.

-మీ ప్రభుత్వం హయం లో 2014-2023 వరకు మీరు ఎంత క్యూబిక్ మీటర్లు ఇచ్చారో బహిరంగ విచారణ కి రండి అపుడు టెండర్ లు అని మీ బినామీ ఆయన గుత్తేదారులు కి ఇచి ఇక్కడ ఉన్నా గిరిజనులు పొట్ట కొడితివి... కరీంనగర్, భూపాలపల్లి, పెదపల్లి, మహబూబ్నగర్ నారాయణపేట లో ఎంత క్యూబిక్ మీటర్లు పెర్మిషన్ ఇచ్చారు.. అపుడు భద్రాచలం ములుగు గిరిజనులకు ఎంత పెర్మిషన్ ఇచ్చారు... పెర్మిషన్ ఇస్తే ఇక్కడ కి లారీ లు బాగా వస్తాయి ఇక్కడ పెర్మిషన్ ఇవ్వకూడదు అనే ఆలోచన చేసి నువ్వు నీ బినామీలు పెర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకున్నారు బహిరంగ సభ కి మా గిరిజనులు మొత్తం సిద్ధం

ఇటుకలపాడు, జాజిరెడ్డిగూడెం ఇసుక క్వారీల నుంచి మీ పార్టీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన జీరో బిజినెస్ వ్యవహారాలను కూడా ప్రజలు మర్చిపోలేదు. ఆ ఘటనలపై సమాధానం చెప్పకుండా నేడు గిరిజన క్వారీలపై విమర్శలు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

ఇప్పుడు ప్రభుత్వం గిరిజన సొసైటీలకు న్యాయం చేస్తూ, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉంటే అది మీకు అన్యాయంగా కనిపించడం ఆశ్చర్యకరం. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం మీకు ఇబ్బందిగా అనిపిస్తే ప్రజలే దానికి తగిన సమాధానం చెప్తారు..

-గిరిజనులు అయిన మేము బతకటం మీకు ఇష్టం లేదా

ఎందుకు లేని పోని ఆరోపణలు చేసి ఇక్కడ ఉన్నా మంత్రులు మీద ఆరోపణలు చేసి మా పొట్ట కొట్టి రాజకీయ లబ్ధి పొందుతావు ఇంకా మీ హయాంలో చేసిన ఇసుక బిల్లులు ఇవకుండా 2019 -2023 నుంచి మమ్మలిని మోసం చేసి ఇంకా ఎందుకు అంత అసూయ మా గిరిజన మంత్రి మీద లేని పోని ఆరోపణలు తగదు ...

ఆయన ఈ ప్రభుత్వం లో మాకు ఉపాధి కల్పిస్తూ పారదర్శకంగా ఇసుక యొక్క రవాణా జరుగుతుంది ...అందుకు నిదర్శనం మా ప్రాంత లో పర్యటించి తెలుసుకోగలవు.

బహిరంగ చర్చకు మేము సిద్ధం ఇక్కడ మా గిరిజన ఉపాధికి ప్రభుత్వం తరపున ఎంత క్యూబిక్ మీటర్లు పెర్మిషన్ వచ్చిందో...నిజం తెలుసుకుని మాట్లాడు అని హెచ్చరించారు..నువ్వు నీ మనుషులు తో చేస్తే ఒక నీతి ఇంకొకరు చెస్తే తప్పా...ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ క్వారీ లో జరిగే తీరు ప్రజలకి యావత్ పత్రిక సోదరులు కి తెలుసు... నువ్వు చెత్త మాటలు మానాలి ఎవడో చెప్పిన మాటలు విని ఒక పార్టీ కి అధ్యక్షుడు అయి ఉండి ఇంత దిగజారి మాటలు మాట్లాడుతావు అనుకోలేదు...ఇక నైనా ఆరోపణ చేసే ముందు తెలుసుకో ఎంత పెర్మిషన్ ఇచ్చారు 12 కోట్లా.. ? ఎంత అనే తెలుసుకో..?

ఇంకా దీనికి తోడు నీ బ్లాక్మెయిల్ గుండా గాలిని పెట్టుకుని మా క్వారీ లో డ్రోన్ ఎగిరవేయటానికి నీకు ఎవరు ఇచ్చారు.. ఆ డ్రోన్ లు ఎగురవేసిన వాలు, ఎలా గిరిజనులు క్వారీ లో డ్రోన్ లు ఎగురవేసి మా హక్కు లు కాలరస్తారు.. దీనికి తగిన పరిణామాలు ఉంటాయి అని మర్చిపోవద్దు ..ఆ డ్రోన్ లు ఎగురవేసిన వాలు, నీకు మాయ మాటలు చెప్పిన వాలు మా గిరిజన క్వారీ లు అమ్ముకుని ఎంత లబ్ధి పొందారో తెలుసుకో ముందు నువ్వు...?

పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా అగుపించినట్లు అవినీతి లో పీకలు దాక కురికపోయిన మీకు పక్షపాతంగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేనటువంటి మంత్రులపైన ఆరోపణలు చేయడం మి దుర్బుద్ధికి నిదర్శనం. ఎ లాంటి ఆధారాలు లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడడం , మీ రాజకీయ మనుగడకే ప్రమాదకర, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మీకు రాజకీయ భవిష్యత్తు ఉంటుంది...

# భద్రాచలం కు నూతనంగా వేసిన బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం...

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 18,

నూతనంగా వేసిన బ్రిడ్జి కృంగడంతో బ్రిడ్జి పనులు ప్రారంభిస్తుండగా నూతనంగా వేసిన బ్రిడ్జిపై రాకపోకలను కొంతకాలంగా నిలిపివేశారు సారపాక వద్ద ఆ రూటుకి వెళ్లకుండా బ్రాకెట్లు పెట్టి తీసివేయడంతో మణుగూరు నుండి ఒక యువకుడు పల్సర్ బైక్ పై అతివేగంగా బ్రిడ్జి పైకి వెళ్లడంతో బ్రిడ్జి ఎక్కకుండా ఫినిషింగ్ తీగల లాంటివి పెట్టగా గమనించని ఆ యువకుడు ఫినిషింగ్ తెగల్లోకి దూసుకొని పోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు...



# నిజాయితీకి నిదర్శనం.. రూ.35 వేల నగదు ఉన్న బ్యాగును యజమానికి అప్పగించిన మెడికల్ షాపు యజమాని.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 18, ప్రస్తుత సమాజంలోనూ మానవత్వం, నిజాయితీ ఇంకా సజీవంగానే ఉన్నాయని నిరూపించారు భద్రాచలానికి చెందిన 'సాయి సందీప్ వెటర్నరీ మెడికల్స్' యజమాని హరిబాబు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ముందు చెప్పుల వ్యాపారం చేసుకునే వ్యక్తి మర్చిపోయిన నగదు బ్యాగును భద్రపరిచి, తిరిగి యజమానికి అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

బుధవారం రాత్రి తన వ్యాపారం ముగించుకుని వెళ్లే క్రమంలో చెప్పుల వ్యాపారి పొరపాటున సుమారు రూ.35 వేల నగదు ఉన్న బ్యాగును అక్కడే వదిలివెళ్లాడు. రాత్రి తన షాపు మూసి ఇంటికి వెళ్తున్న హరిబాబు ఆ బ్యాగును గుర్తించి సురక్షితంగా తన షాపులో భద్రపరిచారు.

గురువారం బ్యాగు పోయిందని బాధపడుతున్న వ్యాపారిని గుర్తించిన హరిబాబు, తోటి వ్యాపారుల సమక్షంలో బ్యాగును యథాతథంగా తిరిగి అప్పగించారు. బ్యాగులో తన పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాల కోసం దాచుకున్న మొత్తం నగదు సురక్షితంగా ఉండటంతో వ్యాపారి హరిబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఎవరూ చూడని సమయంలో కూడా నిజాయితీని పాటించి, యజమానిని వెతికి మరీ నగదు బ్యాగును అప్పగించిన హరిబాబు చర్య స్థానిక వ్యాపారులకు ఆదర్శంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్ పాల్గొని హరిబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి ఆదర్శవంతమైన వ్యక్తులు సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# నకిలీ లాయర్లకు చెక్ పెట్టేందుకు డిజిటల్ రిజిస్ట్రీ ఏర్పాటు



దేశంలో నకిలీ న్యాయవాదుల సమస్యకు అడ్డుకట్ట వేయడంతో పాటు న్యాయవాదుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు జాతీయ స్థాయిలో డిజిటల్ రిజిస్ట్రీ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిపై సుప్రీంకోర్టు స్పందించింది. ఆ అంశంపై కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తదితర సంస్థలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని గురువారం నోటీసులు జారీ చేసింది. భారత బార్ అసోసియేషన్ (బీఏఐ) దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌లో ప్రతిపాదించిన ఆలోచన వినూత్నంగా ఉందని, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దీనిని అమలు చేయడం సాధ్యమేనని ప్రాథమికంగా అభిప్రాయపడింది. తదుపరి విచారణను జూలై నెలకు వాయిదా వేసింది.

### ప్రతి న్యాయవాదికి ప్రత్యేక గుర్తింపు

దేశవ్యాప్తంగా న్యాయవాదుల కోసం నేషనల్ డిజిటల్ రిజిస్ట్రీ ఫర్ లీగల్ ప్రొఫెషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌డీఆర్ఎల్‌పీ) పేరుతో ఒక సమగ్ర డిజిటల్ వేదికను ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఇందులో ప్రతి న్యాయవాదికి ప్రత్యేక జాతీయ అడ్వకేట్ గుర్తింపు సంఖ్య (యూనిక్ నేషనల్ అడ్వకేట్ ఐడెంటిఫయర్) ఇవ్వాలని సూచించారు. అలాగే న్యాయవాది నమోదు స్థితి, విద్యార్హతలు, క్రమశిక్షణా చర్యల వివరాలు, ప్రాక్టీస్‌కు అర్హత వంటి సమాచారం రియల్‌టైమ్‌లో అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించాలని కోరారు. ప్రజలు, కోర్టులు లేదా సంబంధిత అధికారులు క్యూఆర్ కోడ్ ద్వారా న్యాయవాది వివరాలను వెంటనే ధ్రువీకరించుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### విభిన్న రాష్ట్రాల్లో విభజనతో సమస్యలు

పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రస్తుతం దేశంలో సుమారు 18 లక్షల మంది న్యాయవాదులు నమోదై ఉన్నారు. అయితే వీరి వివరాలను ఒకే చోట సమగ్రంగా ధ్రువీకరించుకునే జాతీయ స్థాయి డేటాబేస్ లేదు. ప్రస్తుతం 23 రాష్ట్ర బార్ కౌన్సిళ్లు విడివిడిగా నమోదు ప్రక్రియలు నిర్వహిస్తున్నాయని, వీటి మధ్య ఏకరీతి ప్రమాణాలు లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక న్యాయవాది విద్యార్హతలు, నమోదు చెల్లుబాటు వంటి అంశాలను ప్రజలు తక్షణం తెలుసుకునే అవకాశం ప్రస్తుతం లేదని వివరించారు. ఆ పరిస్థితుల వల్ల నకిలీ సర్టిఫికెట్లతో లేదా తప్పుడు సమాచారంతో న్యాయవాదులుగా కొనసాగుతున్న వ్యక్తులను గుర్తించడం కష్టమవుతోందని బీఏఐ అభిప్రాయపడింది. అందుకే సాంకేతికత ఆధారిత శాశ్వత వ్యవస్థ అవసరమని పేర్కొంది.

### సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం

పిటిషన్‌లో మరో ముఖ్య అంశంగా సోషల్ మీడియా వినియోగంపై న్యాయవాదులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి రూపొందించాలని కోరారు. అడ్వకేట్స్ యాక్ట్-1961లోని సెక్షన్ 49 కింద బీసీఐ దీనికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు న్యాయవాదులు సోషల్ మీడియా వేదికల్లో కోర్టు హాజరులు, కేసుల వివరాలు, వ్యక్తిగత ప్రచారం కోసం వీడియోలు, రీల్స్, ప్రచార కంటెంట్‌ను విస్తృతంగా పోస్టు చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### 'అసభ్య వ్యాఖ్యలు చూస్తున్నాం'

విచారణ సందర్భంగా సోషల్ మీడియా ప్రవర్తన అంశం ప్రస్తావనకు రావడంతో ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ వేదికల్లో కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. 'మేము కొన్ని నమూనాలను చూశాం. చాలా అసభ్యకరమైన వ్యాఖ్యలు, ప్రకటనలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. వాటికి న్యాయవృత్తితో ఎలాంటి సంబంధం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిజమైన న్యాయవాదులు వృత్తి నైతిక విలువలను గౌరవిస్తారని, న్యాయవాదిగా మారిన మొదటి రోజు నుంచే వృత్తి ధర్మం గురించి నేర్చుకుంటారని పేర్కొంది. న్యాయవృత్తిని అపకీర్తి పరుస్తున్న వ్యక్తులు నిజంగా వృత్తిపరమైన ప్రమాణాలను పాటించే న్యాయవాదులేనా అన్న సందేహం కూడా వ్యక్తం చేసింది.

### యువ న్యాయవాదులే భవిష్యత్తు

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి యువ న్యాయవాదుల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువ న్యాయవాదులను బలోపేతం చేయడం అత్యంత అవసరమని అన్నారు. దేశంలోని కొన్ని హైకోర్టులు, జిల్లా కోర్టుల్లో యువ న్యాయవాదులు తమ స్వంత సంఘాలను ఏర్పాటు చేసుకుని విద్యా కార్యక్రమాలు, న్యాయ అంశాలపై చర్చలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. 'మన ఆశలన్నీ యువ న్యాయవాదులు, రాబోయే తరం న్యాయవృత్తి సభ్యులపైనే ఉన్నాయి' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

### యూజీసీ పాత్ర కూడా కీలకం

న్యాయ విద్యార్హతల ధ్రువీకరణ కోసం యూజీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ పోర్టల్ ఏర్పాటు చేయాలని కూడా పిటిషన్‌లో కోరారు. బీసీఐ గుర్తింపు పొందిన అన్ని న్యాయ కళాశాలల డిగ్రీ వివరాలను ఈ పోర్టల్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో న్యాయవాదుల విద్యార్హతలను సులభంగా ధ్రువీకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో న్యాయ విశ్వవిద్యాలయాలను కూడా కేసులో పక్షాలుగా చేర్చాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

### పర్యవేక్షణ కమిటీ ప్రతిపాదన

ఎన్‌డీఆర్ఎల్‌పీ అమలును పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా పిటిషన్‌లో కోరారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి పురోగతి నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ స్థాయి న్యాయ పరిపాలన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా ఆ డిజిటల్ రిజిస్ట్రీని అభివృద్ధి చేయడానికి న్యాయ శాఖ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తగా 3కోట్ల మందికి రేషన్ కార్డులు



దేశవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు మరో 3 కోట్ల కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) జాబితాల నుంచి 2.21 కోట్ల మంది అనర్హులను తొలగించిన నేపథ్యంలో కొత్త లబ్ధిదారులను చేర్చేందుకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ ప్రహ్లాద్ జోషి ఈ మేరకు వ్యాఖ్యానించారు.

### అనర్హుల జాబితాలో 8.51 కోట్ల మంది

అనర్హుల తొలగింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలే తమ ప్రమాణాల ప్రకారం నిర్వహించాయని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. మరణించిన వ్యక్తులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఫోర్? వీలర్? వాహనాలు కలిగిన వారు సహా మొత్తం 8.51 కోట్ల మంది అనర్హుల జాబితాను కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ గుర్తించి రాష్ట్రాలకు పంపిందన్నారు. అందులో ఇప్పటివరకు 2.21 కోట్ల మందిని మాత్రమే రాష్ట్రాలు తొలగించాయని వివరించారు. కొన్ని రాష్ట్రాలు ఈ ప్రక్రియను పూర్తిచేయగా, మరికొన్ని రాష్ట్రాలు ఇంకా అనర్హులను గుర్తించే పనిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో మొత్తం 79 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ఖర్చు తగ్గించడం కాదని, నిజంగా అవసరమైన వారికి ఆహార ధాన్యాలు చేరేలా చూడడమేనని స్పష్టం చేశారు.

### ఆహార ధాన్యాలు పంపిణీ

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేసే లక్ష్యం యథావిధిగా కొనసాగుతోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్? జోషి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ డిజిటలీకరణ వల్లే లబ్ధిదారుల వివరాల ధ్రువీకరణ సులభమైందన్నారు. ప్రస్తుతం పీఎంజీకేవై కింద పంపిణీ అవుతున్న ఆహార ధాన్యాల్లో 98.5 శాతం ఆధార్ ధ్రువీకరణ, ఈ-పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పీఓఎస్) యంత్రాల ద్వారా అందుతున్నాయని చెప్పారు.

### స్మార్ట్ గోదాములు, డిపోలు

ఆహార ధాన్యాల నిల్వ, పంపిణీ వ్యవస్థలో స్మార్ట్ గోదాములు, డిపోలు వంటి ఆధునిక సాంకేతికతలను ప్రవేశపెడుతున్నామని ప్రహ్లాద్ జోషి చెప్పారు. పూర్తిస్థాయి డిజిటల్ పంపిణీ వ్యవస్థ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. కొవిడ్ తర్వాత ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన సహా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కారణంగా సుమారు 25 కోట్ల మంది కడు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. దీనిని ఐఎమ్?ఎఫ్?, నీతి ఆయోగ్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రస్తావించాయని మంత్రి చెప్పారు. ఈ ఏడాది ఆహార సబ్సిడీ భారం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, కేటాయించిన బడ్జెట్‌తోనే ప్రభుత్వం నిర్వహించగలదని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితం ఏపీ పర్యటనకు వచ్చిన ప్రహ్లాద్ జోషి కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పౌరసరఫరాల బియ్యం పక్కదారి పట్టకుండా బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడంతో పకడ్బందీగా సరఫరా జరుగుతోందన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బాగా పర్యవేక్షించడంతో విజయవంతమైందని చెప్పారు. ఈ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు చెందిన బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ప్రహ్లాద్ జోషి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్..



దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధి రేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల్లో కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధి రేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగం వల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా, సుమారు 2,760 మంది మృత్యువాత పడ్డారు. వీటితో పాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనల కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదు కాని చిన్న చిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం మరియు ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండండి

నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు మరో మూడు రోజులే సమయం ఉన్న నేపథ్యంలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అభ్యర్థులకు కీలక సూచనలు చేసింది. జూన్ 21 (ఆదివారం) జరగనున్న ఈ పరీక్షకు ప్రశాంతంగా సిద్ధం కావాలని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్టీఏ 'ఎక్స్' వేదికగా విద్యార్థులకు భరోసానిస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేసింది. "మీరు ఎంతో కష్టపడి సిద్ధమయ్యారు. ఇప్పుడు మీ శ్రమపై నమ్మకం ఉంచాల్సిన సమయం వచ్చింది. ఆందోళన చెందకుండా, తగినంత విశ్రాంతి తీసుకుని పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చండి" అని పేర్కొంది. మే 3న జరిగిన పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్ యూజీ-2026 పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ పునరుద్ఘాటించింది. పరీక్షల పారదర్శక నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అభ్యర్థులు అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని సూచించింది. పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం 'మానస్' (14416) మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది. "ఒత్తిడికి లోనవుతుంటే మీరు ఒంటరి వారని భావించకండి. సహాయం కోరడం బలహీనత కాదు, అది మీ బలానికి నిదర్శనం" అని పేర్కొంది. నిర్ధారణ లేని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కోరింది.

## భవిష్యత్తు ఇంధనంపై కొత్త ఆశలు..

భవిష్యత్‌లో పెట్రోల్, డీజిల్ వంటి సంప్రదాయ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్‌ను భావిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నుంచి పరిశ్రమలు, రవాణా రంగం వరకు అనేక అవసరాలకు ఉపయోగపడే ఈ స్వచ్ఛ ఇంధనాన్ని తక్కువ ఖర్చుతో తయారు చేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జర్మనీకి చెందిన ఓ స్టార్టప్ కొత్త సాంకేతికతను అభివృద్ధి చేసింది. ఎండ, నీటిని ఉపయోగించి నేరుగా హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే ప్రత్యేక ప్యానెల్‌ను రూపొందించినట్లు ప్రకటించింది. జర్మనీలోని కార్ల్స్రూహే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఐటీ) నుంచి ఏర్పడిన 'ఫోట్రియాన్' అనే స్టార్టప్ ఈ ప్యానెల్‌ను అభివృద్ధి చేసింది. సాధారణంగా గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ముందుగా సోలార్ ప్యానెల్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేసి, దానితో ఎలక్ట్రోలైజర్ ద్వారా నీటిని విడదీసి హైడ్రోజన్‌ను పొందుతారు. అంటే రెండు వేర్వేరు వ్యవస్థలు అవసరం అవుతాయి. అయితే ఫోట్రియాన్ రూపొందించిన కొత్త ప్యానెల్‌లో ఈ రెండు దశలు అవసరం ఉండవని సంస్థ చెబుతోంది. ఏప్రిల్‌లో జర్మనీలో నిర్వహించిన హానోవర్ మెస్సే వాణిజ్య ప్రదర్శనలో ఒక చదరపు మీటర్ విస్తీర్ణం గల నమూనా ప్యానెల్‌ను సంస్థ ప్రదర్శించింది. ఈ ప్యానెల్ సూర్యరశ్మిని గ్రహించి, నీటిలోని అణువులను నేరుగా విడదీసి హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా మారుస్తుంది. ఇందులో ఎక్కడా విద్యుత్ ఉత్పత్తి జరగదు. 'ఫోటోక్యాటలిసిస్' అనే ప్రక్రియ ఆధారంగా ఈ సాంకేతికత పనిచేస్తుంది. హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాజా పరిశోధన కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. తక్కువ ఖర్చుతో భారీ స్థాయిలో తయారు చేయగలిగే విధంగా ప్యానెళ్లను రూపొందించినట్లు ఫోట్రియాన్ వెల్లడించింది. చిన్న పరిశ్రమల నుంచి భారీ సౌర హైడ్రోజన్ కేంద్రాల వరకు వీటిని వినియోగించే అవకాశం ఉందని పేర్కొంది.

## ఇప్పట్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం సాధ్యం కాదు



పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రమంతి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ ఒప్పందంతో ముడిచమురు ధరలు తగ్గిన వెంటనే ఇంధన ధరలను తగ్గించలేమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన ఇదివరకు పెంచిన ధరలను వెంటనే తగ్గించలేమని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. తక్కువధరకు లభించే ముడిచమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని సురేశ్ గోపి తేల్చిచెప్పారు. ఇటీవల ఇంధన ధరల్లో నమోదైన పెరుగుదలపై స్పందించిన సురేశ్ గోపి, లీటర్?కు సుమారు రూ.3.94 మేర పెరుగుదల ప్రభావం మాత్రమే వినియోగదారలపై పడిందన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పి వెంటనే ఆ పెరుగదలను వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. చౌకైన ముడి చమురును భారత్?కు తీసుకురావడనాకి హర్మూజ్ జలసంధి గుండా రవాణా చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఆ మార్గంలో నౌకల రాకపోకలు అధికంగా ఉండటంతో పరిస్థితులు సాధారణ స్థితికి చేరేందుకు కొంత సమయం పడుతుందని వివరించారు.

### పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

పశ్చిమాసియాలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని సురేష్ గోపీ తెలిపారు. పెరిగిన వ్యయభారాన్ని కొంత మేర కేంద్ర ప్రభుత్వం భరించిందని చెప్పారు. ఈ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అధిక ఇంధన ధరల సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని తగ్గించుకునేలా పన్నుల్లో తగ్గింపు చేయలేదని, అయితే కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు వ్యవస్థను కొనసాగించాల్సిన బాధ్యతను నిర్వర్తించాయని అన్నారు.

### కేరళలో ఎయిమ్స్ ఏర్పాటుపై వ్యాఖ్యలు

కేరళలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్?) ఏర్పాటు అంశంపైనా సురేష్ గోపీ స్పందించారు. ఎయిమ్స్ ఏర్పాటు సాధారణ కొనుగోలు ప్రక్రియ కాదని, దీనికి నిర్దిష్ట విధానాలను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఎయిమ్స్ కోసం గుర్తించిన ప్రదేశాల వివరాలను సంబంధిత కమిటీకి అందించాలని, అనంతరం ఆ ప్రదేశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఆరోగ్య మంత్రి కే మురళీధరన్ ఎయిమ్స్‌ను కేరళలో ఎక్కడైనా ఏర్పాటు చేయవచ్చని చేసిన వ్యాఖ్యల్లో కొంత స్పష్టత లోపించిందని సురేష్ గోపీ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై చర్చించేందుకు తనను సంప్రదిస్తానని ఆరోగ్య మంత్రి చెప్పినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఆహ్వానం అందలేదని వెల్లడించారు. ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు ముగిశాయి. ఇటీవల ఇరాన్- అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. తాజాగా ఇరు దేశాలు అధ్యక్షులు అవగాహన ఒప్పందంపై డిజిటల్ సంతకాలు కూడా చేశారు. ఈ ఒప్పందం కుదరడం వల్ల చమురు ధరలు కూడా పడిపోయాయి. అయితే ఈ యుద్ధం కారణంగా గత మూడు నెలలుగా చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతేకాకుండగా చమురు సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అంతరాయాలు ఏర్పాడ్డాయి. దీంతో ఈ ప్రభావం పూర్తిగా తొలగిపోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. చమురు, సహజవాయు సరఫరాలు సాధారణ స్థితికి చేరాయని షిప్పింగ్, బీమా సంస్థలు పూర్తిగా నమ్మిన తర్వాతే ధరలు స్థిరపడే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

## సంపాదకీయం

# ఆవిష్కరణకు ఆకాశమే హద్దు


భారతీయ నిపుణుల సామర్థ్యంపై ఎలాంటి సందేహం లేదు -అత్యాధునిక, మార్గదర్శక ఆవిష్కరణలు చేయగల శక్తి వారికి ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తులైన టెక్నాలజీ సంస్థల్లో భారతీయులు, భారత సంతతికి చెందిన ఎగ్జిక్యూటివ్‌లు అత్యున్నత స్థానాల్లో నిలవడం ఇందుకు సాక్ష్యం. వ్యవస్థాపక నిర్వహణ, సాంకేతికరంగాల్లో -సంక్లిష్టమైన, ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను నిర్మించడంలో, ముందుకు తీసుకెళ్లడంలో భారతీయ నాయకత్వం అసాధారణ ప్రతిభను చాటుకుంది. ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో జరిగిన 'భారత్ ఇన్నొవేట్స్ 2026' కార్యక్రమం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మద్దతుతో నిర్వహించబడటమే ఈ సామర్థ్యానికి తాజా నిదర్శనం. వ్యూహాత్మక రంగాల్లో స్టార్టప్‌లను సహనంతో ఇంక్యుబేట్ చేయడం ద్వారా, ప్రపంచంలోనే అత్యుత్తమమైన వాటితో పోటీపడే అసాధారణ ఫలితాలు సాధించవచ్చని ఈ వేడుక నిరూపించింది. ప్రపంచవ్యాప్త ఆవిష్కరణలకు భారత్ ఒక నిలయం కాగల అవకాశం వాస్తవమైనదే. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ వేడుకలో ప్రతిపాదించిన మధ్యశక్తుల సహకారంవంటి విధానాల ద్వారా ఇది మరింత సాధ్యమవుతుంది. ఈ ఆవిష్కరణ ప్రశ్న, ఆంత్రోపిక్ సంస్థకు చెందిన అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడళ్లు- క్లాడ్ మిథోస్, ఫేబుల్ -అమెరికన్లు కానివారికి నిషేధించబడిన పరిణామాన్ని అర్థం చేసుకోవడంలో కీలకంగా మారింది.

ఈ నిషేధం కొంతమంది భారతీయ సంస్థలను, వినియోగదారులను ప్రభావితం చేసింది. ఒక్క సంస్థ మాత్రమే ఈ రంగాల్లో నెమ్మదిగా పురోగతి సాధించడానికి పదుల బిలియన్ డాలర్లు అవసరమవుతున్న పరిస్థితుల్లో, ఫ్రాంటియర్ ఏఐ లేదా సెమీకండక్టర్ టెక్నాలజీని కేవలం బలప్రయోగంతో సాధించడం సాధ్యం కాకపోవచ్చు. చాలామంది సాంకేతిక విధాన నిర్ణేతలు సూచిస్తున్న భారత్ ఏఐ "డిప్లాయ్‌మెంట్ సూపర్‌పవర్" కావాలన్న లక్ష్యం కూడా ఓటమి నిశ్చితమైన పోరాటం కావచ్చు. ఎందుకంటే నాలెడ్జ్ ఎకానమీ సామర్థ్యాలను ఏఐనుంచి రాబట్టుకోవాలనుకుంటున్నది భారత్ ఒక్కటే కాదు. అయినప్పటికీ, అవకాశాల క్షేత్రం ఇంకా విస్తృతంగానే ఉంది. అంతరిక్ష పరిశోధన, రక్షణ, మరి పదార్థ శాస్త్రాలువంటి డీప్ టెక్ రంగాలు ఇప్పటికీ తెరిచిన పోటీ మైదానాలే!

భారత్ ఆవిష్కరణ బాటలో ముందుకు సాగాలంటే, రెండు కీలక అంశాలు అవసరం. మూలధనానికి, ప్రతిభకు స్థిరమైన, ఆకర్షణీయమైన నిలయంగా మారాలి. మూలధనం విషయానికొస్తే, విజయం సాధించిన వారిపై విరుచుకుపడే నిరంకుశ అద్దె- వేటాడే ధోరణులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. విజయం సాధించడమే ఒక శాపంగా మారే భయం, ఆవిష్కర్తలను భారత నేలపై వెన్నుచూపేలా చేయకూడదు. మరోవైపు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు- ఇతర దేశాల్లో మాదిరిగానే- అన్వేషణాత్మక, అత్యాధునిక వ్యాపార ప్రతిపాదనలను అదేస్థాయిలో మదింపు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. పన్ను విధానాలు స్పష్టంగా, ముందుగానే అంచనా వేయగలిగేలా ఉండాలి. ఆకస్మిక మార్పులు, అనిశ్చితి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ప్రతిభావంతుల విషయానికొస్తే, అవసరమైనది చాలా సరళమైనదే. అత్యున్నత ప్రతిభావంతులు తమ భవిష్యత్తును భారత్‌లోనే చూసుకోవాలి, తమ సామర్థ్యానికి, తాము కోరుకునే జీవనశైలికి ఇక్కడ ఒక "డెడ్ ఎండ్" తప్ప మరేమీ లేదని భావించి, పచ్చిక బయళ్లు ఎక్కువగా ఉన్న ఇతర దేశాలకు పరుగులు పెట్టే పరిస్థితి రాకూడదు.

ఇందుకోసం, పరిశుభ్రమైన గాలి, సమృద్ధిగా పట్టణ హరిత స్థలాలు, సరసమైన, విశ్వసనీయమైన ప్రజా రవాణా వంటి ప్రజా వస్తువులపై పెట్టుబడులు చాలా దూరం తీసుకువెళ్తాయి. విదేశాల నుంచి తిరిగివచ్చిన వారు అత్యధికంగా మిస్సవుతున్నది ఇవే అని గుర్తుంచుకోవాలి. ఎన్ని అవకాశాలు సృష్టించినా, నివాసయోగ్యత లోటు ఆ అవకాశాల ఆకర్షణను తుడిచిపెట్టేస్తుంది. ఒక శాస్త్రవేత్త, ఒక ఇంజినీర్, లేదా ఒక వ్యవస్థాపకుడు- తన పనిలో అంతర్జాతీయ స్థాయి సవాళ్లను ఎదుర్కొంటూనే, తన నగరంలో శ్వాస తీసుకోవడానికి, పిల్లలను పెంచడానికి, ప్రయాణించడానికి నిత్యం పోరాడాల్సిన పరిస్థితి ఉంటే- ఆ ద్వంద్వ భారం దీర్ఘకాలంలో నిలబడలేనిది.

భారతదేశంలోని కొన్ని పురాతనమైన, మొండిగా నిలిచిన సమస్యలే- నిజమైన ఆవిష్కరణాత్మక వ్యవస్థ ఏర్పడకుండా అడ్డుపడుతున్నాయి. శుభవార్త ఏమిటంటే- ఈ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైనది రిస్క్ క్యాపిటల్ కాదు, రాజకీయ సంకల్పం. అంటే, డబ్బు కొరత కాదు సమస్య- విధానపరమైన ధృఢసంకల్పం, అమలు చేసే చిత్తశుద్ధి కొరవడిందే నిజమైన అడ్డంకి. రెగ్యులేటరీ సంస్థలను సరళతరం చేయడం, బ్యూరోక్రాటిక్ జాప్యాలను తగ్గించడం, న్యాయవ్యవస్థలో వాణిజ్య వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడంవంటి సంస్కరణలు- ఏ భారీ బడ్జెట్ ప్రకటనలకంటే ఎక్కువ ప్రభావం చూపగలవు. ప్రపంచ ఆర్థిక శక్తుల మధ్య మధ్యశక్తుల సహకారం అనే భావన ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, దాన్ని వాస్తవరూపంలోకి తీసుకురావడానికి భారత్ తన అంతర్గత గృహకార్యాన్ని ముందుగా పూర్తిచేయాల్సి ఉంటుంది. విదేశీ సదస్సుల్లో ప్రశంసలు అందుకోవడం వేరు, దేశీయంగా ఒక ఆవిష్కర్త తన ఆలోచనను వ్యాపారంగా మార్చుకునేటప్పుడు ఎదురయ్యే లైసెన్సింగ్ చిక్కులు, మూలధన కొరత, మానవ వనరుల వలసలు వంటి యథార్థ సవాళ్లను అధిగమించడం వేరు. ఏఐ, సెమీకండక్టర్ల వంటి అత్యంత మూలధన-ఇంటెన్సివ్ రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా మారాలని ఆరాటపడే బదులు, తనకున్న బలాలను- వ్యవస్థాపక నైపుణ్యం, సాంకేతిక ప్రతిభ, యువ జనశక్తి వ్యూహాత్మకంగా ఉపయోగించుకుని, డీప్ టెక్ రంగాల్లో ఎంచుకున్న కొన్ని క్షేత్రాల్లో ప్రపంచస్థాయి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంపై దృష్టిసారించడం వివేకవంతమైన మార్గం. చివరిగా, భారత్ తన ప్రతిభావంతులైన పౌరులకు, వారు దేశం వదిలి వెళ్లకుండా, తమ కలలను ఇక్కడే నిజం చేసుకునేలా ఒక నమ్మదగిన, ఊపిరిసలిపే వాతావరణాన్ని అందించగలిగితే, నిజమైన ఆవిష్కరణాత్మక శక్తిగా ఎదగడం దూరం కాదు. ఇందుకు అవసరమైనది ఇంకొక సదస్సు కాదు, నిర్దిష్ట కాలపరిమితితో అమలు చేసే రాజకీయ చిత్తశుద్ధే!



# చేతికి చుక్కెదురు!?

మన చేతుల కండరాలు, కీళ్లు, నాడీ వ్యవస్థ వైవిధ్యమైన కదలికలకు అనుగుణంగా రూపొందినవి. కానీ ఆధునిక జీవనశైలి వీటిని ఒకే రకమైన, పునరావృతమైన కదలికలకు బలవంతంగా అలవాటు చేస్తోంది. రోజుకు గంటల తరబడి ఒక్క చేతిలోనే ఫోన్‌ను పట్టుకుని, ఒకే బొటనవేలితో స్క్రోల్ చేయడం వంటి అలవాట్లు- కండరాలు, స్నాయువులు, నాడులపై తీవ్రమైన భారాన్ని మోపుతున్నాయి. మణికట్టును సహజమైన కోణంలో కాకుండా వంకర భంగిమల్లో ఎక్కువసేపు ఉంచడం వల్ల నాడులపై ఒత్తిడి పెరిగి, వాపు, నొప్పి, చేతి సామర్థ్యం తగ్గిపోవడంవంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఈ అతి-వినియోగం వల్ల తలెత్తే సమస్యల్లో మొదటిది "టెక్స్టింగ్ థంబ్". నిరంతరం టైప్ చేయడం వల్ల బొటనవేలి కీలు భాగాల్లో మంట, నొప్పి ప్రారంభమవుతుంది. రెండోది "ట్రిగ్గర్ ఫింగర్"- వేలును వంచినప్పుడు అది అకస్మాత్తుగా లాక్ అయిపోవడం, లేదా క్లిక్ అనే శబ్దంతో కదలడం. మూడోది, మరింత తీవ్రమైనది- "కార్పల్ టన్నెల్ సిండ్రోమ్". మణికట్టులోని ఒక సన్నని నాళం గుండా వెళ్లే మధ్యమ నాడిపై అధిక ఒత్తిడి పడినప్పుడు ఇది సంభవిస్తుంది. దీని లక్షణాలు చేతిలో తిమ్మిర్లు, బలహీనత, సూదులతో గుచ్చినట్లు అనిపించడం. నాలుగోది "రిస్ట్ టెండినిటిస్"- మణికట్టు చుట్టూ వాపు, నొప్పి. వీటితోపాటు నాడీ సంబంధిత మంట, వస్తువులను గట్టిగా పట్టుకునే శక్తి తగ్గడం వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి.

ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ సమస్యలు కేవలం వయోజనులకే పరిమితం కాదు. చదువు, ఉద్యోగం, గేమింగ్, సోషల్ మీడియా కోసం స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడుపుతున్న యువతరం కూడా వీటి బారిన పడుతోంది. తప్పుడు భంగిమలో ఫోన్ చూడటం వల్ల ప్రభావం చేతులు, మణికట్టుకే పరిమితం కాదు- మెడ, భుజాల కండరాలపై కూడా అదనపు భారం పడుతుంది. అంటే, ఒక చిన్న అలవాటు శరీరం మొత్తం మీద ప్రభావం చూపగలదు.

ఈ సమస్యలను తొలి దశలోనే గుర్తించడం ముఖ్యం. బొటనవేలిలో నొప్పి, మణికట్టు బిగుసుకుపోవడం, వేళ్లలో అడపాదడపా తిమ్మిర్లు, చేతుల్లో బలహీనత, చిన్న వస్తువులను పట్టుకోవడంలో ఇబ్బంది వంటి సంకేతాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వీటిని విస్మరిస్తే, దీర్ఘకాలిక నొప్పులుగా మారడమే కాకుండా, రోజువారీ సాధారణ పనులను కూడా కష్టతరం చేస్తాయి.

అయితే, ఈ సమస్యలకు పరిష్కారం మన చేతుల్లోనే ఉంది- అక్షరాలా! స్మార్ట్‌ఫోన్ వాడే అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా వీటిని చాలావరకు నివారించవచ్చు. ప్రతి 20-30 నిమిషాలకు ఒకసారి తప్పనిసరిగా విరామం తీసుకోవడం మొదటి అడుగు. ఒక్క బొటనవేలుపైనే భారం వేయకుండా రెండు చేతులను ఉపయోగించడం మంచిది. ఫోన్‌ను పట్టుకునేటప్పుడు మణికట్టును వీలైనంత సహజమైన స్థితిలో ఉంచుకోవడం అవసరం. అనవసరమైన స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవడం, వీలైనప్పుడు టెక్స్టింగ్ బదులు వాయిస్-టు-టెక్స్ట్ ఫీచర్‌ను ఉపయోగించడం కూడా చేతులపై భారాన్ని తగ్గిస్తుంది. వీటితోపాటు, చేతులు, మణికట్టు కండరాలను సాగదీసే చిన్న వ్యాయామాలను రోజువారీ అలవాటుగా చేసుకోవడం ఎంతో ఉపయోగకరం.

ఒకవేళ నొప్పి తగ్గకుండా కొనసాగుతున్నా, రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తున్నా, లేదా తిమ్మిర్లు తరచుగా వస్తున్నా- వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం. ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన విశ్రాంతి, ఫిజియోథెరపీ, సరైన వ్యాయామాల ద్వారా ఈ సమస్యల నుంచి సులభంగా బయటపడే అవకాశం ఉంటుంది. స్మార్ట్‌ఫోన్ వాడకం నేటి జీవితంలో అనివార్యమైన భాగంగా మారిన ఈ సమయంలో, దాన్ని పూర్తిగా వదిలేయడం ఆచరణీయం కాకపోవచ్చు. కానీ సరైన అవగాహనతో, చిన్నచిన్న జాగ్రత్తలతో, సమతుల్యమైన అలవాట్లతో- సాంకేతికతను ఆస్వాదిస్తూనే, మన చేతుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పూర్తిగా మన చేతుల్లోనే ఉంది.

# కొండనాల్కకు మందేస్తే..!




భారతదేశంలో విషతుల్యమైన దగ్గు మందుల సమస్య పదే పదే తలెత్తుతూ, చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా చర్య చూస్తే, సమస్యను అర్థం చేసుకోవడంలోనే పెద్ద లోపముందని స్పష్టమవుతోంది. చిన్నారుల మరణాల ఎనిమిది నెలల తర్వాత, ప్రభుత్వం కనిపెట్టిన పరిష్కారం ఏమిటంటే- దగ్గు మందులను షెడ్యూల్ 'కె' జాబితానుంచి తొలగించడం. ఇప్పటివరకు ఈ షెడ్యూల్ కింద గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ దుకాణాల్లో కూడా ఈ మందులు అమ్మకానికి అనుమతి ఉండేది. ఇప్పుడు అన్ని దగ్గు మందులకూ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేశారు. ఆచరణలో చాలావరకు ఇప్పటికే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే అమ్ముడవుతున్నా సరే. ఇది సమస్యను అమ్మకాల పద్ధతిగా చూడటమే తప్ప, అసలు సమస్య ఏమిటో గుర్తించకపోవడమే. ప్రశ్న ఇక్కడ ఉంది- ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేయడం వల్ల కల్తీ ఆగుతుందా? ఎలా ఆగుతుంది? సమస్య మందులు ఎలా అమ్ముడవుతున్నాయన్నది కాదు, ఏం అమ్ముడవుతున్నాయన్నదే. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉన్నా, అందులో రాసిచ్చిన మందే విషంతో తయారైనదైతే, ఆ చీటీ ఏం చేస్తుంది? ఇది గొంతు సమస్యకు తల నొప్పికి మాత్రిచ్చినట్టుంది.

డైఎథిలీన్ గ్లైకాల్ అనేది పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించే, నియంత్రిత రసాయనం. ఇది అనుమతించదగిన పరిమితికి మించి దగ్గు మందుల్లో కలిస్తే, అది మూత్రపిండాల వైఫల్యానికి దారితీసి ప్రాణాంతకమవుతుంది. ఇది కొత్త సమస్య కానేకాదు. భారతదేశంలో 1972 నుంచే డీఈజీ విషప్రయోగ ఉదంతాలు నమోదవుతున్నాయి. 2020, 2022, 2023 సంవత్సరాల్లో కూడా ఇలాంటి సామూహిక విషప్రయోగాలే చోటుచేసుకున్నాయి. గత అక్టోబర్‌లో మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో కనీసం 22మంది చిన్నారులు దగ్గు మందు తాగి మృత్యువాతపడిన ఘటన దీనికి తాజా ఉదాహరణ. ఇది కేవలం దేశీయ సమస్యగా మిగలలేదు. భారత్‌లో తయారైన దగ్గు మందులు గాంబియా, కామెరూన్, ఉజ్బెకిస్తాన్‌లలో కూడా చిన్నారుల సామూహిక మరణాలకు కారణమయ్యాయి. అంటే ఈ సమస్య మన దేశ ఔషధ పరిశ్రమ ప్రతిష్ఠపై, ప్రపంచవ్యాప్తంగా నీలినీడలు పరుస్తున్న తీవ్రమైన వ్యవస్థాగత వైఫల్యం. అరవై ఏళ్లుగా పునరావృతమవుతున్న ఈ ముప్పును ఒక సాధారణ నిబంధనను సవరించడం ద్వారా పరిష్కరించాలనుకోవడం, వ్యాధి నిర్ధారణ తప్పుగా చేసినప్పుడు ఎలాంటి చికిత్స ఇచ్చినా ఫలితం ఉండదన్న వాస్తవాన్ని విస్మరించడమే.

ఈ సమస్యకు మూలకారణాలు ఏమిటో ఇప్పటికే స్పష్టంగా తెలిసినవే, పదే పదే నిర్ధారణ అయినవే. మొదటిది- తయారీ యూనిట్లు నియంత్రణ లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నాయి. గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్ పేరుకే ఉన్నా, వాస్తవంలో పాటించేవారు తక్కువ. రెండోది- దీర్ఘకాలిక సిబ్బంది కొరత, అస్తవ్యస్తమైన తనిఖీలు, వీటికి తోడు అవినీతి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్య తగినంత లేకపోవడంవల్ల, వేలాది తయారీ యూనిట్లను సరిగా పరిశీలించడం అసాధ్యమవుతోంది. మూడోది- బహిరంగంగా రద్దు చేసిన లైసెన్సులు, ప్రజల దృష్టి సడలిన వెంటనే నిశ్శబ్దంగా పునరుద్ధరించబడుతున్నాయి. ఇది శిక్షను ప్రదర్శనగా మార్చి, బాధ్యతను ఎగవేసే ఎత్తుగడ. నాలుగోది- డాక్టర్లు, ఫార్మసిస్టులు తమ సొంత కుటుంబ ఫార్మసీల ద్వారా ప్రయోజనం పొందుతూ, ప్రయోజన వైరుధ్య నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఇది ప్రిస్క్రిప్షన్ నిబంధనను మరింత నిరర్థకం చేస్తుంది- ఎందుకంటే ఆ చీటీ ఇచ్చేవారే, దాన్ని అమ్మేవారే ఒకటే వ్యవస్థలో భాగమైతే, నియంత్రణ ఎక్కడిది? ఐదోది- విషప్రయోగ లక్షణాల సమూహాలను గుర్తించి హెచ్చరించే వ్యవస్థ డాక్టర్లకు అందుబాటులో లేదు. ఒక ప్రాంతంలో ఒకేసారి అనేక మూత్రపిండాల వైఫల్య కేసులు వచ్చినా, వాటిని అనుసంధానించి కారణాన్ని వెంటనే పట్టుకునే యాంత్రికత లేదు. ఆరోది- సమర్థవంతమైన మందుల ఉపసంహరణ యాంత్రికత లేకపోవడం. దీనివల్ల కల్తీ బ్యాచులు మార్కెట్లో అలాగే చలామణీలో ఉండి, మళ్లీ మళ్లీ మరణాలకు కారణమవుతున్నాయి. ఏడోది- ప్రతి బ్యాచ్ ముడిసరుకు, తుది ఉత్పత్తిని పరీక్షించాలని, రికార్డులు నిర్వహించాలని నిబంధనలు ఉన్నా, ఇన్‌పుట్ల చైన్-ఆఫ్-కస్టడీ డాక్యుమెంటేషన్ ఎక్కడా కనిపించదు. ముడిసరుకు ఎక్కడినుంచి వచ్చింది, దాన్ని ఎవరు ఎప్పుడు పరీక్షించారు అన్న ఆనవాళ్లే లేకపోతే, కల్తీ ఎక్కడ జరిగిందో గుర్తించడం కష్టమవుతుంది.

ఈ లోపాలన్నీ కలిసి సూచించేది ఒకటే- పేలవమైన నియంత్రణ, పారదర్శకత, బాధ్యతలకు నిరోధకంగా ఉన్న ఒక వ్యవస్థను. దీనికి పూర్తి భిన్నంగా, అమెరికా అనుభవాన్ని గుర్తుచేసుకోవడం అవసరం. 1937లో అమెరికాలో సల్ఫానిలమైడ్ ఎలిక్సిర్ విషాదం తర్వాత, ఔషధ చట్టాలను కఠినతరం చేసి, కట్టుదిట్టమైన నియంత్రణ అమలు చేశారు. దీని ఫలితంగా అమెరికాలో 'డెగ్' మరణాలు పూర్తిగా నిర్మూలించబడ్డాయి. అంటే ఈ సమస్యకు పరిష్కారం తెలియనిది కాదు- అమలు చేసే రాజకీయ సంకల్పం కొరవడిందే సమస్య.

ప్రతిసారి సామూహిక విషప్రయోగం జరిగిన తర్వాత, భారత అధికార యంత్రాంగం ఒక సుపరిచితమైన చక్రంలో పడిపోతుంది- మొదట తిరస్కారం, తర్వాత తాత్కాలిక కఠిన చర్యలు, చివరికి బ్యాండ్-ఎయిడ్, పరిష్కారాలు. ఇప్పుడు అమల్లోకి తెచ్చిన ప్రిస్క్రిప్షన్ నిబంధన కూడా ఈ చక్రంలో మరో అంకమే. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లను సైతం బూటకంగా సంపాదించుకోవడం సాధ్యమే- అది మరో సమాంతర కుంభకోణం తప్ప మరేమీ కాదు. చివరగా, ప్రభుత్వం ప్రిస్క్రిప్షన్-మాత్రమే అమ్మకాలను ఎలా అమలు చేయాలని భావిస్తోంది? యాంటీబయాటిక్స్ విషయంలోనే భారత్ ప్రిస్క్రిప్షన్-మాత్రమే అమ్మకాలను నిర్ధారించలేకపోయింది. అదే సమయంలో యాంటీబయాటిక్ అతి-ప్రిస్క్రిప్షన్‌ను కూడా అరికట్టలేకపోయింది. ఈ రెండు వైఫల్యాలు కళ్లముందు ఉండగా, దగ్గు మందుల పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఆశించడానికి ఎలాంటి కారణమూ లేదు. అసలు సమస్య పంపిణీ నియంత్రణ కాదు, తయారీ నాణ్యత నియంత్రణ. ఔషధ నియంత్రణ సంస్థలను బలోపేతం చేయడం, ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచడం, లైసెన్సు రద్దును శాశ్వతంగా అమలు చేయడం, రియల్-టైమ్ బ్యాచ్ టెస్టింగ్ డేటాను పబ్లిక్‌గా అందుబాటులో ఉంచడం, తక్షణ రీకాల్ యాంత్రికతను నెలకొల్పడం- ఇవే నిజమైన పరిష్కారాలు. వీటిని వదిలి, కాగితంపై ఒక చీటీని తప్పనిసరి చేయడం ద్వారా సమస్యను పరిష్కరించామని భావించడం, వ్యవస్థాగత వైఫల్యాన్ని పాలనాపరమైన మెరుగుదలగా మభ్యపెట్టే ఎత్తుగడే. చిన్నారుల ప్రాణాలు ఇంకా బలిపీఠంపైనే ఉన్నాయని, ఈ కొత్త నిబంధన వాస్తవ సమస్యను తాకలేదని ప్రభుత్వం గుర్తించాలి. లేకపోతే, మరో విషాదం వరకు ఈ చర్చ మరుగున పడిపోతుంది- ఎప్పటిలాగే! ■




జీవితమనే సముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు, ప్రతి పెద్ద అలా మనల్ని ముంచేస్తుందని, ప్రతిసారీ నౌక కూలిపోతే ఇక లేచి నిలబడలేమని భయపడే క్షణాలు తప్పవు. డేనియల్ డెఫో తన "రాబిన్సన్ క్రూసో"లో చెప్పినట్టు, ప్రతి తుఫాను మనం మళ్లీ తేలబోమని అనిపించేంత భీకరంగా ఉంటుంది. కానీ అలలు ఎంత బలంగా కొట్టినా, నౌక ఎంతగా వొంగినా, అది మళ్లీ నిలబడుతుంది. ఎందుకంటే దాన్ని అలాగే తయారు చేస్తారు. మన మనసు కూడా అంతే. కష్టాలు వచ్చినప్పుడు అన్నీ అంతమైపోయాయని అనిపించినా, ఆ క్షణమే మన బలానికి పరీక్ష. తుఫాను శాశ్వతం కాదు, మన లేచి నిలబడే శక్తి శాశ్వతం. భయం వచ్చినా, ఆశను వదలకపోవడమే నిజమైన ధైర్యం.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# పచ్చబొట్టుతో 'పొడిచాడు'!



డచ్ మహిళ జోకీ (52) కథ నెట్టింట్లో సంచలనం రేపింది. తన ఎక్స్-బాయ్‌ఫ్రెండ్ ఆన్‌లైన్‌లో కొన్న చౌక టాటూ మిషన్‌తో ఆమె శరీరంపై దాదాపు 250 టాటూలు బలవంతంగా వేశాడు. ఆమె ముఖం, కళ్ల దగ్గర, ముక్కు మీద కూడా టాటూలు చేశాడు. మద్యం, మాదకద్రవ్యాలతో ఆమెను నిస్సహాయురాలిగా మార్చి ఈ హింస సాగించాడని ఆరోపణ. సంబంధం విడిపోయాక పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఆమె అంగీకారంతోనే చేశానని అతను వాదించడంతో కేసు నిలిచిపోయింది. ఇప్పుడు భారీ ఖర్చుతో లేజర్ తొలగింపు చికిత్స చేయించుకుంటున్న జోకీకి, స్ప్రిట్జ్ వాన్ టాటరీ సంస్థ క్రౌడ్‌ఫండింగ్‌తో అండగా నిలిచింది. ముఖంపై టాటూలు ఇప్పటికే తొలగిపోయాయి. నేను లేచి నిలబడగలిగాను, మరొకరూ నిలబడగలరు' అంటూ జోకీ స్ఫూర్తినిస్తోంది.



# వెంకీనా... మజాకా...

వెంకటేశ్ – అనిల్ రావిపూడి కాంబోలో కొత్త సినిమా షూటింగ్ మొదలైంది. వెంకటేశ్ నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న రాబోతుండగా, వెంకీ – అనిల్ మూవీ జనవరి 12న రిలీజ్ అవుతోంది. అంటే వంద రోజుల వ్యవధిలో రెండు సినిమాలు వస్తాయన్నమాట! విక్టరీ వెంకటేశ్ సైలెంట్‌గా హిట్ కొట్టేస్తుంటాడు. హడావుడీ ఆర్భాటం లేకుండా తన అభిమానులనే కాదు తెలుగు సినిమా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంటాడు. ఆ మధ్య వరకూ సరైన విజయాలు లేక కాస్తంత డీలా పడ్డాడు వెంకటేశ్. 2024 సంక్రాంతి కానుకగా వచ్చిన 'సైంధవ్' నిరాశ పర్చినా... ఆ తర్వాత సంవత్సరం సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఘన విజయం సాధించి, ఆయన్ని తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కించింది. అదే ఊపుతో ఈ యేడాది సంక్రాంతికి చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు'లో కీలక పాత్ర పోషించి, మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు వెంకటేశ్.

వెంకటేశ్ సోలో హీరోగా నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' మూవీ ప్రస్తుతం సెట్స్ మీద ఉంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా దసరా కానుకగా విడుదల కాబోతోందని మొదటే మేకర్స్ చెప్పారు. రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించక పోయినా... ఇది అక్టోబర్ 2న జనం ముందుకు వస్తుందని సమాచారం. విశేషం ఏమంటే... సరిగ్గా దానికి వందరోజుల తర్వాత వెంకటేశ్ నటిస్తున్న మరో సినిమా 2027 జనవరి 12న విడుదల కాబోతోంది. అదే అనిల్ రావిపూడి దర్శకుడిగా గురువారం మొదలైన చిత్రం. వెంకటేశ్‌తోపాటు నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో కృతిశెట్టి, కీర్తి సురేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నాడు. సో...ఈ యేడాది సంక్రాంతి నుంచి వచ్చే యేడాది సంక్రాంతి వరకూ వెంకటేశ్ నటించిన మూడు సినిమాలు వస్తుంటే... అందులో రెండు సినిమాలు కేవలం వంద రోజుల గ్యాప్‌తో రావడం మరో విశేషం. మరి ఫుల్ ఫామ్‌లో ఉన్న వెంకటేశ్ ఈ రెండు సినిమాల ద్వారా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలి.

# శర్వా పర్ఫార్మెన్స్.. నెక్ట్స్ లెవెల్: సంపత్ నంది..!



చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు సంపత్‌నంది కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'భోగి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కాగా ఈ చిత్ర సెట్స్ నుండి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. షూటింగ్‌లో శర్వానంద్ పండించిన ఒక ఎమోషనల్ సీన్ చూసి తాను కట్ చెప్పడం కూడా మర్చిపోయానని దర్శకుడు సంపత్ నంది సోషల్ మీడియా వేదికగా తెలిపాడు. గత దశాబ్ద కాలంలో శర్వానంద్ ఇచ్చిన బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇదేనని ఆయన కొనియాడాడు. ఆ సీన్ ముగియగానే సెట్స్‌లో ఉన్న 200 మందికి పైగా యూనిట్ సభ్యులు చప్పట్లు కొడుతూ, కళ్ల నీళ్లు తుడుచుకున్నారని సంపత్ నంది పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఇలాంటి అనుభూతి కలగడం ఇదే మొదటిసారని తెలిపాడు. ఇప్పుడు తాను చెప్పిన మాటలు గుర్తుపెట్టుకోవాలని.. థియేటర్లలో 'భోగి' చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా కచ్చితంగా ఇదే ఎమోషన్‌కు గురవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. ఇక ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.

# రజినీతో ధనుష్ క్లాష్..?




కోలీవుడ్ లో ఈ ఏడాది దీపావళి పండుగకు ఒక భారీ బాక్సాఫీస్ క్లాష్ జరగబోతున్నట్లు తెలుస్తోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంది. నెల్సన్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ డిజిటల్ రైట్స్ డీల్ ప్రస్తుతం చర్చల దశలో ఉంది. ఈ చిత్రంలో బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్ పోషిస్తుండగా, ఆయనకు సంబంధించిన షూటింగ్ వచ్చే వారం జరగనుంది. మేకర్స్ ఈ సినిమాను దీపావళి కానుకగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు, వర్సటైల్ యాక్టర్ ధనుష్ కూడా తన 55వ సినిమాను అదే దీపావళి రేసులో నిలపాలని భావిస్తున్నట్లు కోలీవుడ్ మీడియా సమాచారం. 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియాసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు సినిమాల టీమ్స్ షూటింగ్స్ పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నాయి. రజనీకాంత్ 'జైలర్ 2' అధికారిక ప్రకటన త్వరలోనే రానుండగా, ధనుష్ 55వ చిత్ర బృందం కూడా తమ దీపావళి రిలీజ్ ప్లాన్‌ను త్వరలోనే ప్రకటించనుంది. ఒకవేళ ఇదే నిజమైతే, ఈ దీపావళికి బాక్సాఫీస్ వద్ద ఇద్దరు స్టార్ హీరోల మధ్య గట్టి పోటీ తప్పేలా లేదు.

## రాశీ సింగ్ మూవీ నుంచి తొలి గీతం!

యంగ్ బ్యూటీ రాశీ సింగ్ టాలీవుడ్‌లో తన సత్తా చాటుతోంది. ఆమె నటించిన తాజా చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' శుక్రవారం విడుదల కాబోతోంది. దానికి ఒకరోజు ముందు గురువారం రాశీ సింగ్ లేటెస్ట్ మూవీ 'గాసిప్' నుంచి పబ్ సాంగ్ రిలీజ్ అయ్యింది. 'గాసిప్' మూవీని వైభవ్ కౌండిన్య (ఝఅఎష్టఝజ ఖశీబఅఇఅఅఝ) దర్శకత్వంలో యతి నిర్మిస్తున్నారు. 'సిప్పు సిప్పు...' అంటూ సాగే ఈ ఎనర్జిటిక్ పబ్ డాన్స్ ట్రాక్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, శక్తికాంత్ కార్తీక్ స్వరాలు సమకూర్చారు. ఈ పాటను మాళవిక పాడింది. గతంలో రూమర్స్‌ను స్ప్రెడ్ చేయడానికి ఆకాశరామన్న ఉత్తరాలు, గోడమీద రాతలు రాసేవాళ్లని, ఇప్పుడు పుకార్లకు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారంటూ సెటైరిక్‌గా ఈ పాట సాగింది. మిడిల్ క్లాస్ అమ్మాయి జీవితం చుట్టూ తిరిగే 'గాసిప్' సినిమా యూత్‌కు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులకూ నచ్చేలా తీర్చిదిద్దుతున్నామని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా విడుదలైన 'సిప్పు.. సిప్పు...' గీతానికి సునీల్ సున్నపు మాస్టర్, ఫల్గుణి బంగెర కొరియోగ్రఫీ సమకూర్చారు.



## ఖుషీ చేసుకుంటున్న పవన్ ఫ్యాన్స్..!

టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా దర్శకుడు సుజిత్ నెక్ట్స్ ప్రాజెక్ట్‌పై జోరుగా ప్రచారం సాగుతోంది. నానితో చేయాల్సిన 'బ్లడీ రోమియో' కంటే ముందే 'ఓజీ 2' సెట్స్ పైకి రానుందనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలోనే పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ స్వయంగా ఈ క్రేజీ సీక్వెల్‌పై స్పందించి సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు మరింత బలాన్ని చేకూర్చాడు.




అరుదైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తన అభిమాని నిరంజన్‌ను పరామర్శించేందుకు పవన్ కళ్యాణ్ వరంగల్ హనుమకొండకు వెళ్లారు. అక్కడ ఆ కుటుంబంతో ఎంతో ఆప్యాయంగా గడిపిన ఆయన, తన అభిమానికి అన్ని విధాలా అండగా ఉంటానని మాట ఇచ్చారు. కేవలం ఒక సెలబ్రిటీలా కాకుండా ఒక పెద్దన్నలా పవన్ చూపించిన ఈ మానవత్వం ఇప్పుడు అందరి హృదయాలను గెలుచుకుంటోంది. అయితే ఈ పర్యటనలో నిరంజన్‌తో ముచ్చటిస్తూ పవన్ 'ఓజి 2' ప్రస్తావన తీసుకురావడం విశేషం. 'ఓజి 2 సినిమా తీస్తే నిన్ను స్పెషల్ గెస్ట్‌గా ఈవెంట్‌కి పిలుస్తాను.. మనమిద్దరం కలిసే సినిమా చూద్దాం' అంటూ పవన్ ఒక క్రేజీ ప్రామిస్ చేశారు. పవన్ నోట ఈ మాట రావడంతో నిరంజన్ కుటుంబం భావోద్వేగానికి గురయ్యారు. ఇక ఇండస్ట్రీ వర్గాలు మరియు అభిమానులు 'ఓజి 2' రావడం ఖాయమని ఫిక్స్ అయిపోయి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఫొటో స్టార్!




# గ్లోబల్ రేంజ్ అంటే ఇది!




టాలీవుడ్ సెన్సేషన్, రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులతో బిజీ హీరోగా దూసుకుపోతోన్న విజయ్ దేవరకొండ.. ప్రస్తుతం ఓ రేర్ ఫీట్‌ని సాధించారు. టాలీవుడ్ సెన్సేషన్, రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులతో బిజీ హీరోగా దూసుకుపోతోన్న విజయ్ దేవరకొండ, రీసెంట్‌గా రియల్ లైఫ్‌లోనూ సూపర్ హీరో అనిపించుకున్నారు. తన లైఫ్ పార్ట్‌నర్ రష్మిక మందన్నతో కలిసి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. అచ్చంపేట డివిజన్‌లోని 45 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అంద జేశారు. సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటుకుంటూ విజయ్ చేసిన ఈ మంచి పనికి అభిమానులతో పాటు నెటిజన్లు సైతం ఫిదా అవుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. విజయ్ దేవరకొండ ఖాతాలో ఒక అరుదైన, మైండ్ బ్లోయింగ్ రికార్డ్ చేరింది. గతంలో పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'లైగర్' సినిమా కోసం బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్న విజయ్.. ఇప్పుడు మరో ఇంటర్నేషనల్ స్టార్‌తో తలపడబోతున్నారు. 'ది మమ్మీ' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న హాలీవుడ్ విలన్ ఆర్నాల్డ్ వోస్లూ విజయ్ కొత్త సినిమాలో నటించబోతున్నారు. ఇలా ఇద్దరు హాలీవుడ్ లెజెండ్స్‌తో కలిసి పనిచేసిన తెలుగు హీరోగా విజయ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశారు.

రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రణబాలి' చిత్రంలోనే ఈ గ్లోబల్ మ్యాజిక్ జరగబోతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. వివాహం తర్వాత ఈ క్రేజీ కపుల్ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న సినిమా కావడంతో 'రణబాలి'పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హాలీవుడ్ రేంజ్ యాక్షన్, ఎమోషన్స్‌తో రాబోతున్న ఈ చిత్రం విజయ్ దేవరకొండ మార్కెట్‌ను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.



## వాయిదా పడ్డ 'దీవాన'..

యంగ్ హీరో హర్షిత్‌రెడ్డి, స్నేహా మణిమేగలై జంటగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ డ్రామా 'దీవాన' జూన్ 19న గ్రాండ్ రిలీజ్ డేట్‌కు రెడీ అయింది. అయితే, రిలీజ్‌కు ఒక్క రోజు ముందు ఈ సినిమా వాయిదా పడింది. ముందుగా ప్రకటించినట్లుగా ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రావడం లేదు. సెన్సార్ పనులు పూర్తి కాకపోవడంతో మేకర్స్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, గత రెండు రోజులుగా ఈ సినిమాకు సంబంధించిన ప్రీమియర్ షోలు విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి. ఇక ఇప్పుడు ఈ చిత్రాన్ని జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేగాక జూన్ 19న ఈ చిత్ర పెయిడ్ ప్రీమియర్స్ ఉంటాయని వారు వెల్లడించారు. శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించిన ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తుండటం విశేషం. వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ఈశ్వర్ చంద్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు.